ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 21.0

జిల్లా అధికారులు అందుబాటులో ఉండాలి

» జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేశ్

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 26 : జిల్లాలోని ఆయా శాఖలపరంగా ఉన్న సమస్యలను పరిష్కారం కోసం వచ్చే ప్రజలకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తమతమ కార్యాలయాల్లో అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేశ్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లా అధికారులకు సోమవారం సర్క్యులర్‌ను జారీ చేశారు. సంబంధిత ప్రజల నుంచి స్వీకరించిన వినతులకు పరిష్కార చర్యలు తీసుకోవాల న్నారు. ఇందుకోసం ప్రత్యేక రిజిస్టర్‌ను నిర్వహించాలన్నారు. సంబంధిత వినతులపై తీసుకున్న చర్యల నివేదికను ప్రతి సోమవారం నిర్వహించే జగనన్న స్పందన కార్యక్రమంలో సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏ ఒక్కరూ ఈ విషయంలో ఫిర్యాదు చేసేందుకు ఆస్కారం లేకుండా సత్వర పరిష్కార చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

వర్చువల్ విధానంలో ప్రధాని మోదీ
రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలు ప్రారంభం
పట్టిసీమ శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు
» ఇసుక బస్తాలు, తడికలతో నడకమార్గం 7



కమలనాథులు సంసిద్ధం

నేడు ఏలూరులో బూత్ కమిటీలతో భారీ సభ

» హాజరుకానున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
» క్షేత్రస్థాయిలో కేడర్‌కు దిశా నిర్దేశం
» పొత్తుంటే ఓకే.. లేకున్నా బరిలోకి రెడీ
» పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలపైనే ఉత్కంఠ
» ఏలూరు లోక్‌సభ మీదే ఫోకస్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)





రాజ్‌నాథ్‌సింగ్ సభకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న తపనా చౌదరి, అంబికా కృష్ణ తదితరులు

రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ఒంటరిగా పోటీ చేయబోతోందా ? లేదా ? మరికొన్ని పార్టీలతో పొత్తుకు దిగబోతుందా అనే సందిగ్ధం వీడకపోయినా వచ్చే ఎన్నికలకు వీలుగా సమర నాదం చేస్తోంది. పార్టీ పెద్దలు క్షేత్రస్థాయిలో కేడర్‌ను కార్యరంగంలోకి దించుతున్నారు. పార్టీ పరంగా బల నిరూపణకు సన్నద్ధం అవుతున్నారు. ఎక్కడి కక్కడ పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నూరిపోయడం, నాయ కులతో సమన్వయంతో ముందుకు సాగడం, బూత్ స్థాయిలో నియమితులైన కమిటీ సభ్యులు ఎలా అప్రమత్తంగా వ్యవహరించాలో దిశా నిర్దేశం చేస్తున్నారు. క్లస్టర్ల వారీగా రాష్ట్రంలో వివిధ పార్లమెంట్ నియోజక వర్గాలను విభజించి ఆ మేరకు సీనియర్లు రంగంలోకి దిగారు. ఎన్నికల్లో అత్యంత కీలకమైన బూత్ కమిటీలకు మంగళవారం ఏలూరులో బీజేపీ సీనియర్ నేత, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ దిశా నిర్దేశం చేయబోతున్నారు. ఇప్పటికే వివిధ క్లస్టర్లలో వివిధ విభాగాలతో భేటీ అయ్యేలా పార్టీ కార్యాచరణ చేసింది. ఉభయ గోదావరి జిల్లాల్లోని ఐదు పార్లమెంట్ నియోజక వర్గాలను ఒక క్లస్టర్‌గా విభజించి ఆయా నియోజకవర్గాల్లో బూత్ కమిటీ సభ్యులను, పార్టీ కీలక బాధ్యతల్లో వున్న నేతలను ఏలూరు రప్పిస్తున్నారు. దేశంలోనే తొలిసారిగా ఈ తరహా క్లస్టర్‌స్థాయి బూత్ కమిటీ సభ్యుల సమావేశం ఏలూరులో జరగనుండడంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీజేపీ కదనోత్సాహం

వచ్చే ఎన్నికల్లో అమీతుమీ తేల్చుకునేందుకు కమలనాథులు సిద్ధపడుతున్నారు. ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పార్టీలో కీలకంగా, సమర్థవంతంగా పనిచేసిన వారే కాకుండా బీజేపీ భావజాలం కలిగిన మరికొందరు పెద్ద సంఖ్యలోనే దరఖాస్తు చేసుకున్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి వచ్చిన దరఖాస్తుల సంఖ్య రాష్ట్ర నాయకత్వాన్ని సంతృప్తి పరిచింది. ఉన్నత విద్యావంతులైన మహిళలు ఫలానా నియోజకవర్గం నుంచి తమకు సీటు కేటాయించాలని దరఖాస్తు చేసిన వారిలో వున్నారు. గడచిన ఎన్నికల్లో బీజేపీ కొందరిని ఎంపిక చేసి అసెంబ్లీ పార్లమెంట్ స్థానాల బరిలో నిలిపింది. అప్పట్లో ప్రధాన పక్షాలన్నీ ఎవరంతట వారుగా ఒంటరిగా పోటీ చేశారు. బీజేపీ అన్ని నియోజకవర్గాల్లోనూ అభ్యర్థులను రంగంలోకి దించినా ఆశించినంత ఓట్ల శాతాన్ని దక్కించుకోవడంలో విఫలమైంది. ఆనాడున్న రాజకీయ పరిణామాల్లో భాగంగా బీజేపీ దాదాపు మిగతా పార్టీల కంటే భారీగా వెనుకబడింది. కాకినాడ, రాజమహేంద్రవరం, నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గాల్లోనూ, తాడేపల్లిగూడెంతో సహా మిగతా నియోజకవర్గాల్లో బీజేపీకి అంతో ఇంతో పట్టుండేది. ఆ దిశగానే ఒంటరిగానైనా, పొత్తు లో భాగమైనా బీజేపీ ఆ స్థానాల దిశగా అడుగులు వేసేది. 2014లో వున్న ముఖచిత్రం పూర్తిగా మారడం, ఆ తర్వాత ఒంటరి పోటీ, బీజేపీని మిగతా పార్టీలకు దీటుగా మార్చలేక పోయింది. ఇప్పుడు టీడీపీ-జనసేన కూటమితో కలిసి వెళ్లేం దుకు వీలుగా బీజేపీ కేంద్ర నాయకత్వం ఇప్పటికే అంతర్గత కసరత్తు చేసింది. అసెంబ్లీ, పార్లమెంటరీ స్థానాల్లో పోటీకి వీలుగా జాబితాను సిద్ధం చేసి సంకేతం ఇచ్చినట్టు చెబుతున్నారు. బీజేపీ పోటీ చేయదలిస్తే ఏ ఏ స్థానాలు ఆ పార్టీకి పొత్తులో భాగంగా క్లియరెన్స్ ఇస్తారనేది సస్పెన్స్‌లోనే ఉంది.

దేనికైనా సంసిద్ధంగా ఉండండి..

ఎన్నికలు జరిగేందుకు కేవలం కొన్ని రోజులే మిగిలి ఉన్నందున సాధ్యమైనంత మేర పోటీకి వీలుగానే అందరూ సంసిద్ధం కావాలని బీజేపీ పార్టీ కేడర్‌కు సంకేతాలిచ్చింది. ఒక వేళ పొత్తు ఉన్నా లేకపోయినా, ఎవరి పని వారు చేసుకుపోవాలని, క్షేత్రస్థాయిలో అందరూ అప్రమత్తం కావాలని సూచించారు. ఏలూరు పార్లమెంటరీ నియోజక వర్గం నుంచి పోటీ చేసేందుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపన చౌదరి ఇప్పటికే ప్రజల మధ్యకు దూసుకెళ్లారు. క్షేత్రస్థాయిలో పార్టీ అనుకూలత దక్కేలా జాగ్రత్త పడుతున్నారు. ప్రధాన కూడళ్లు, రోడ్డు మార్గాల్లో చాన్నాళ్ల నుంచి చౌదరి పేరిట హోర్డింగ్‌లు వెలవడమే కాకుండా కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రవేశపెడుతున్న పథకాలను విస్తృతంగా ప్రచారం చేశారు. ఏలూరు పార్లమెంటరీ స్థానంలో ఏ మారుమూలకు వెళ్లినా కమలం జెండా కనిపించేలా చేశారు. అయితే పార్టీ నిర్ణయం మేరకు తన తుది నిర్ణయం ఉంటుందని మొదటి నుంచి చౌదరి చెబుతూ వస్తున్నారు. ఈ స్థానం నుంచే పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, సుజనాచౌదరి, సీఎం రమేష్ వంటివారు ఆసక్తితో ఉన్నారనే ప్రచారం సాగింది. ఒకవేళ పొత్తుతో పోటీకి దిగితే అది మరింత బలంగా ఉంటుందని బీజేపీ కిందస్థాయి కేడర్ అంగీకరిస్తున్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలి హోదాలో పురందేశ్వరి పార్టీ నిర్ణయం ఎలా ఉంటే అలాగే నడుచుకుంటామని ఈ మధ్యనే తేల్చేశారు. తాజాగా పొత్తులో బీజేపీ భాగస్వామ్యం కావొచ్చనే ఊహాగానం మరింత విస్తృతమైంది. ఈ దశలోనే అసెంబ్లీ స్థానాలు చర్చకు వస్తున్నాయి. ఏలూరు పార్లమెంటరీ పరిధిలో ఒక స్థానం, లేదంటే నరసాపురం లోక్‌సభా స్థానం పరిధిలో మరోస్థానం బీజేపీ కోరవచ్చని ప్రచారం ఉంది. పార్లమెంటరీ నియోజక వర్గాల సంఖ్యపైనా ఇదే తర్జనభర్జన.

పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ తాను నరసాపురం లోక్‌సభా స్థానం నుంచి పోటీకి సిద్ధంగా ఉన్నానని దరఖాస్తు చేశారు. తన అభిప్రాయాలను ఢిల్లీలో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశాల్లో పలువురు సీనియర్లతో చర్చించారు. పార్టీ సీనియర్లు పాకా సత్యనారాయణ, సుభాష్, కపర్ది వంటి వారంతా ఈ స్థానంలో పార్టీ పటిష్టతకు, కార్యకర్తలను ముందుకు నడపడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. సాధ్యమైనంత మేర ఈ నెలాఖరుకు జనసేన-టీడీపీ కూటమితో బీజేపీ సయోధ్యకు దిగే అవకాశం లేకపోలేదని భావిస్తున్నారు.

సభను విజయవంతం చేయండి : తపన చౌదరి

ఏలూరు టూ టౌన్ : ఎన్నికలకు ముందు సన్నద్ధంగా ఏలూరులో మంగళవారం జరగబోయే బూత్ కమిటీల సభను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి(తపన చౌదరి) పార్టీ శ్రేణుల కు పిలుపునిచ్చారు. ఏలూరు ఇండోర్ స్టేడియంలో సభా ఏర్పాట్లను సోమవారం గారపాటితో కలిసి బీజేపీ రాష్ట్రీయ సంఘటన్ మంత్రి మధుకర్, కాశీ విశ్వనాథరాజు, అంబికా కృష్ణ, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారా యణ, జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిశోర్ పరిశీలిం చారు. ఈ సందర్భంగా గారపాటి మాట్లాడుతూ సభలో కాకినాడ, అమలాపురం, రాజమండ్రి, నరసాపురం, ఏలూరు పార్లమెంట్ నియోజక వర్గాల పరిధిలో 16 వేల మంది బూత్‌స్థాయి కార్యకర్తలు పాల్గొంటారన్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారన్నారు.



'తెలుగు జన విజయకేతన జెండా' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీడీపీ, జనసేన నేతలు వలవల బాబ్జి, నిమ్మల రామానాయుడు, ప్రత్తిపాటి పుల్లారావు, నాదెండ్ల మనోహర్, కొటికలపూడి చినబాబు, కందుల దుర్గేష్, బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు

తెలుగు జన విజయం

ప్రత్తిపాడులో తొలి ఉమ్మడి సభకు ముమ్మర ఏర్పాట్లు

» భారీ వేదిక, 33 గ్యాలరీలు, రెండు హెలీప్యాడ్‌లు
» ఏర్పాట్లు పరిశీలించిన టీడీపీ, జనసేన నాయకులు
» రాష్ట్రవ్యాప్తంగా జన సమీకరణకు ఇన్‌చార్జులతో మంతనాలు



హెలీప్యాడ్ నిర్మాణం

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 26 : తాడేపల్లిగూడెం వేదికగా తెలుగుదేశం-జనసేన కూటమి తొలి ఎన్నికల శంఖారావం సభకు 'తెలుగు జన విజయకేతన జెండా'గా నామకరణం చేశారు. ఈనెల 28న టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ హాజరయ్యే ఈ సభకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. పెంటపాడు మండలం మండలం ప్రత్తిపాడు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఎన్ఏ మైదానంలో 25 ఎకరాల్లో సభా ప్రాంగణం సిద్ధమవుతోంది. వీఐపీ వాహనాలకు సభా ప్రాంగణం వద్దే పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని వున్న రెండు వైపులా పార్కింగ్ స్థలాలను గుర్తించారు. సభా ప్రాంగణంలో వేలాది మందికి సరిపడేలా 33 గ్యాలరీలను, మహిళలకు ప్రత్యేకంగా గ్యాలరీలు సిద్ధం చేస్తున్నారు. చంద్రబాబు, పవన్‌లు హెలీకాప్టర్లలో వస్తున్నందున కాంక్రీట్ ఫ్లాట్ ఫామ్‌లతో రెండు హెలిప్యాడ్‌లను సిద్ధం చేశారు. ఇరు పార్టీల నుంచి 500 మంది ముఖ్య నేతలు ఆశీనులు కానుండడంతో వేదికను భారీగా నిర్మిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఐదు నుంచి ఆరు లక్షల మంది హాజరు కానున్నారు. ఈ మేరకు నియోజకవర్గాల వర్గాల వారీగా జన సమీకరణకు ఇరు పార్టీల ఇన్‌చార్జ్‌లకు ఆయా అధిష్టానాలు దిశా నిర్దేశం చేశారు. ఇందులో అధికభాగం ఉమ్మడి ఉభయ గోదావరి కృష్ణా జిల్లాల నుంచి రానున్నారు. ఇక్కడి నుంచే ఉమ్మడిగా 50 వేల మంది పాల్గొనేలా సన్నాహాలు చేస్తున్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాతీయ రహదారికి ఇరువైపులా భారీ పార్కింగ్‌లను ఏర్పాటుచేశారు. అవసరమైన అంబులెన్స్‌లను, వైద్య బృందాలను ఏర్పాటు చేశారు.

సంక్షేమం-అభివృద్ధే మా ఎజెండా

సంక్షేమం అభివృద్ధే తమ ఉమ్మడి అజెండా అని నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. జనసైనికులు తెలుగు తమ్ముళ్లు, వీరమహిళలు సభ విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రజలు తెలుగుదేశం-జనసేన పొత్తును కోరుకుంటున్నారని వైసీపీ విముక్త రాష్ట్రం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. టీడీపీ జోన్ 2 ఇన్‌చార్జ్ ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల నుంచి టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చి సభను విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఇన్‌చార్జ్‌లు బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రంలోనే ఇది తొలిసభ కావడంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని కోరారు. జనసేన తాడేపల్లిగూడెం టీడీపీ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి మాట్లాడుతూ టీడీపీ-జనసేన చరిత్రలో ఉమ్మడి సభ నిలిచిపోయే విధంగా విజయవంతం చేస్తామన్నారు. ప్రతీ గ్రామం నుంచి వేలాదిగా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ వేలాది మంది జనసైనికులు మోటారు సైకిల్ ర్యాలీ ద్వారా సభా స్థలికి చేరుకుంటారన్నారు.

సమన్వయ కమిటీ పరిశీలన

టీడీపీ-జనసేన సీట్ల ప్రకటన తర్వాత నిర్వహిస్తున్న తొలి సభ కావడంతో దీనిని విజయవంతం చేసేందుకు ఇరు పార్టీల ముఖ్యనేతలు మూడు రోజులు ముందుగానే తాడేపల్లిగూడెం చేరుకున్నారు. జనసేనలో కీలకంగా వ్యవహరిస్తున్న నాదెండ్ల మనోహర్, టీడీపీ జోన్-2 ఇన్‌చార్జ్ ప్రత్తిపాటి పుల్లారావు తాడేపల్లిగూడెంలోనే బస చేశారు. సభా వేదిక పనులను సమన్వయ కమిటీ పరిశీలించింది. సభా వేదిక, ప్రాంగణ పనులను మనోహర్, పుల్లారావు, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, తాడేపల్లిగూడెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ వలవల బాబ్జి, జనసేన ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు ఇన్‌ఛార్జ్ పచ్చమట్ల ధర్మరాజు పరిశీలించారు.

జనసేనలో నిరసనలు

» రెండు రోజుల్లో నిర్ణయం చెబుతానన్న అప్పలనాయుడు.. నాదెండ్ల మనోహర్ బస వద్ద విడివాడ ఆందోళన

ఏలూరు కార్పొరేషన్/పెంటపాడు, ఫిబ్రవరి 26 : ఏలూరు, తణుకు అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలను టీడీపీకి కేటాయించడంపై ఆయా నియోజకవర్గాల ఇన్ చార్జ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి ఏలూరు జనసేన కార్యాలయంలో ఆ పార్టీ నగర అధ్యక్షుడు నగిరెడ్డి కాశీ నరేష్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డి అప్పలనాయుడు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని పలువురు కార్యకర్తలు కోరారు. దీనిపై ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం ఎంతో చేశా. కాని నాకు టిక్కెట్ ఇవ్వకుండా అన్యాయం చేశారు అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ప్రతీ కార్యకర్త అభిప్రాయాన్ని తెలుసుకుని, అందుకు అనుగుణంగా నా కార్యాచరణ ప్రణాళికను రెండు రోజుల్లో ప్రకటిస్తానని పేర్కొన్నారు. నాయకులు బి.వి.రాఘవయ్య చౌదరి, సిరిపల్లి ప్రసాద్, సరిది రాజేష్, కందుకూరి ఈశ్వరరావు, బొత్స మధు, శ్రావణ గుప్త తదితరులు పాల్గొన్నారు. మరోవైపు తణుకు టిక్కెట్‌ను టీడీపీ ఇవ్వడంపై నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ విడివాడ రామచంద్రరావు మండిపడ్డారు. టీడీపీ-జన సేన సభ నిర్వహణ ఏర్పాట్లు పరిశీలించేందుకు ప్రత్తిపాడు వచ్చిన పార్టీ నాయకుడు నాదెండ్ల మనోహర్ సోమవారం రాత్రి అలంపురంలోని జయ గార్డెన్స్‌లో బస చేశారు. ఇక్కడ నిరసన తెలిపేందుకు ఆయన అనుచరులతో కలిసి వచ్చి అతిథి గృహం లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్, ఇతర నాయకులు, పోలీసులు అడ్డుకున్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు కార్యకర్తలకు సర్దిచెప్పి విడివాడను అతిథి గృహం లోపలకు తీసుకెళ్లారు. విడివాడతో మనోహర్ 45 నిముషాలపాటు మాట్లాడారు. అనంతరం విడివాడ బయటకు రాగా అనుచర వర్గం విడివాడ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ తణుకు బయల్దేరి వెళ్లారు.

టీడీపీలో పార్థసారథి చేరిక



నూజివీడు, ఫిబ్రవరి 26 : పెనమలూరు అధికార పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొలుసు పార్థసారథి టీడీపీలో చేరారు. ఆయనకు సోమవారం మంగళగిరి పార్టీ ప్రధాన కార్యాలయంలో జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ అధినేత చంద్ర బాబు ఇటీవలే నూజివీడు టీడీపీ అభ్యర్థిగా పార్థ సారధిని ప్రకటించారు. ఈ క్రమంలోనే సారథితో పాటు పెనమలూరు వైసీపీకి చెందిన బొప్పన భవకుమార్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్, నూజివీడు మండలం సీతారాంపురం సర్పంచ్, కాంగ్రెస్ నాయకురాలు లింగమనేని వాణి, చాట్రాయి మండలానికి చెందిన మరి కొందరు టీడీపీలో చేరారు. ముందుగా విజయవాడ నుంచి భారీ కార్ల ర్యాలీతో మంగళగిరి పార్టీ ప్రధాన కార్యాలయానికి తరలివెళ్లారు. అనంతరం పార్థసారథి చంద్రబాబును కలిసి ఆశీర్వాదం పొందారు. నియోజక వర్గం నలుమూలల నుంచి పెద్దసం ఖ్యలో కార్యకర్తలు, గ్రామస్థాయి నాయకులు హాజరు కావడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. కాగా నూజి వీడు బరిలో టీడీపీ అభ్యర్థి స్పష్టమైంది. నిన్నటి వరకు స్థానిక వైసీపీలో ఎదురులేని నాయకుడిగా వున్న సిట్టింగ్ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు సీటు ఖరారు విషయంలో స్పష్టత రాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కొద్దిరోజుల నుంచి ఎమ్మెల్యే ప్రతాప్ పలుసార్లు సీఎంవోకు వెళ్లడం నియోజక వర్గంలో చర్చనీయాంశంగా మారింది.

జనసేనలోకి కొత్తపల్లి

నరసాపురం, ఫిబ్రవరి 26 : మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు జనసేనలో చేరారు. సోమవారం హైదరా బాద్‌లో పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఐదు రోజుల క్రితం కొత్తపల్లి త్వరలో జనసేనలో చేరనున్నట్లు ప్రకటించారు. దీనికి అనుగుణంగా ఆయన పార్టీలో చేరారు. గత ఎన్నికల్లో కొత్తపల్లి టీడీపీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. ఆ ఎన్నికల్లో ముదునూరి విజయం కోసం కృషి చేశారు. కొత్తగా ఏర్పడిన పశ్చిమ గోదావరి జిల్లాకు కేంద్రంగా భీమవరాన్ని ప్రకటించడంతో జేఏసీతో కలిసి నరసాపురం జిల్లా కేంద్రం కోసం పోరాటం చేశారు. దీనిపై ఆగ్రహించిన వైసీపీ ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. అప్పటి నుంచి ఏ పార్టీలో చేరకుండా రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. పవన్ నుంచి పిలుపు రావడంతో ఒక్కరే హైదరాబాద్ వెళ్లి జనసేనలో చేరారు. ఆయన అనుచరులు త్వరలో పార్టీలో చేరనున్నారు.

నేడు జేఏసీ నిరసన ప్రదర్శన

29న ఏపీటీఎఫ్ ధర్నాలు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26 : బకాయిల చెల్లింపునకు ఏపీ జేఏసీ ఈ నెల 27న చేపట్టాల్సిన 'చలో విజయవాడ' ఆందోళన అర్ధాంతరంగా వాయిదా వేయడంపై విరుచుకుపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు ఒకొక్కటిగా బయటకువచ్చి పోరాటబాట కొనసాగించాలని నిర్ణయించుకుంటున్నాయి. ఇప్పటికే జేఏసీ నేతల నిర్ణయాన్ని బహిరంగంగానే యూటీఎఫ్ వ్యతిరేకించగా, తాజాగా ఆదేపంథాలో ఏపీటీఎఫ్ పోరాటబాట పట్టాలని నిర్ణయించింది. చలో విజయవాడ ఆందోళనను అడ్డుకుంటూ పోలీసులు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులకు నోటీసులు జారీచేయడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 27న సాయంత్రం 5 గంటలకు ఏలూరులోని ఏపీ ఎన్జీవో హోంవద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ సీహెచ్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం 20 ముఖ్యమైన డిమాండ్లతో పోరాట కార్యక్రమానికి పిలుపునిచ్చిన జేఏసీ కనీసం సభ్యసంఘాలతో కూడా చర్చించకుండా ఆకస్మికంగా ఉద్యమాన్ని వాయిదా వేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర సోమవారం ఓ ప్రకటనలో ప్రకటించారు. ఇక సొంతంగా పోరాటబాట పట్టాలని నిర్ణయించామని, ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని పాత తాలూకా కేంద్రాల వద్ద ఈనెల 29న ధర్నా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ధర్నాల్లో స్థానికంగా వుండే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎక్కువమంది పాల్గొనాలని పిలుపునిచ్చారు.

డీఎస్సీ-2008 అభ్యర్థులకు ఉద్యోగాలు


నియామక పత్రం అంద జేస్తున్న జేడీ, డీఈవో

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26 : డీఎస్సీ-2008 రిక్రూట్‌మెంట్‌లో నష్టపోయిన నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులను కనీస వేతనస్కేలు (ఎంటీఎస్)పై ఎస్జీటీలుగా నియమించాలన్న ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా సోమవారం 16 మందికి కౌన్సె లింగ్ ద్వారా ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 18 మందికి ఉద్యోగావకాశాలకు అవకాశం ఉండగా ఆ మేరకు సమాచారం పంపి నప్పటికీ ఇద్దరు గైర్హాజరయ్యారు. వీరికి మరోదఫా సమాచారం పంపిస్తామని డీఈవో కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఎంటీఎస్‌పై నియమితులైన వీరందరికీ నెలకు రూ.32,610 వేతనంగా రిటైర్మెంట్ వయసు 60 ఏళ్లవరకు చెల్లిస్తారు. వీటికి అదనంగా ఇతర ఆర్థిక ప్రయోజనాలుగాని, పీఆర్సీగాని, పెన్షన్‌గాని, ఉద్యోగ విర మణ పెంపుదల వయసు 62 ఏళ్ళుగాని వర్తించవు. కాగా ఉద్యోగ ఖాళీలన్నీ జిల్లాకు మారుమూల ప్రాంతాల్లో మాత్రమే ఉండటంతో అభ్యర్థుల్లో ఒకింత నిరుత్సాహం నెలకొంది. కౌన్సెలింగ్ అనంతరం అభ్యర్థులకు ఉద్యోగ నియామకపత్రాలను పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ ఆర్.నరసింహారావు, డీఈవో అబ్రహం అందజేశారు.

నేటి నుంచి 'టెట్'

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26 : మంగళవారం నుంచి ప్రారంభం కానున్న ఉపాధ్యాయ అర్హతా పరీక్ష (ఏపీ టెట్) నిర్వహణపై సోమవారం ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల డీఈవోలు, పరీక్షల అధికారులతో టెట్ రాష్ట్ర పరిశీలకునిగా నియమితులైన ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ డైరెక్టర్ ఆర్.నరసింహారావు సోమవారం సాయంత్రం డీఈవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పరీక్షల నిర్వహణపై సూచనలు చేశారు. పరీక్షార్థులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా ముందుగానే సంబంధిత సెంటర్లలో ఏర్పాట్లను పరిశీలించి ఏవైనా లోటుపాట్లు ఉంటే సరిచేయాలని ఆదేశించారు. పరీక్ష గదులను తెలుసుకోవడంలో గందరగోళానికి తావులేకుండా ప్రవేశద్వారం వద్ద నోటీసుబోర్డులో వివరాలను ప్రదర్శించాలని సూచించారు. రెండు జిల్లాల్లో తాను ఏ సమయంలోనైనా ఆకస్మిక తనిఖీలకు వస్తానని వెల్లడించారు. నిర్ణీత పరీక్ష ప్రారంభ సమయం దాటిన తర్వాత ఒక్కనిమిషం ఆలస్యమైనా అభ్యర్థిని అనుమతించబోమని గంట ముందుగానే అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని డీఈవో సూచించారు. డిపార్ట్‌మెంటల్ అధికారులు, డీవైఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26 : ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం కింద అన్ని ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లను అర్హతలు గల పిల్లలకు ఒకటో తరగతిలోకి ఫీజు రీయింబర్స్‌మెంట్ పద్ధతిన ప్రవేశాలు కల్పించేందుకు నోటిఫికేషన్ విడుదలైందని సమగ్రశిక్ష ఏపీసీ ఎస్.సోమశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 5 నుంచి 25వ తేదీలోగా ఆన్‌లైన్ పోర్టల్‌లో బాలల పేర్లు, ఇతర వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బలహీన వర్గాలకు కుటుంబ వార్షికాదాయం రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాలవారికి రూ.1.40 లక్షలు వార్షికాదాయం ప్రాతిపదికన అర్హులను నిర్ణయిస్తామన్నారు. తొలి ఎంపిక జాబితా ఏప్రిల్ 1న, విద్యార్థుల ప్రవేశాల నిర్ధారణ ఏప్రిల్ పదో తేదీలోగా ఉంటాయన్నారు. రెండో జాబితా జూన్ 15న, ప్రవేశాల నిర్ధారణ జూన్ 23లోగా జరుగుతాయని వివరించారు. దరఖాస్తులను సీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో చేసుకోవాలని సూచించారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నన్నయ వర్సిటీ వీసీ

28 నుంచి తెలుగు భాషా సాహిత్యాలపై సదస్సు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 26: తెలుగు భాషా సాహిత్యాలపై రెండురోజుల అంతర్జాతీయ సదస్సు ఈ నెల 28 నుంచి పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలోని ఎస్‌వీకేపీ, డాక్టర్ కేఎస్ రాజు ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో జరుగుతుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. నన్నయ వర్సిటీ అనుబంధ కళాశాలలో జరుగుతున్న ఈ సమావేశాలకు యూనివర్సిటీ సౌజన్యం అందిస్తుందన్నారు.ఈ సమావేశాలకు 2వ అంతర్జాతీయ తెలుగు సమావేశాలుగా పేరు పెట్టినట్టు చెప్పారు. గత ఏడాది ప్రారంభమైన ఈ సమావేశాలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆతిథ్యం ఇచ్చిందన్నారు.

రేపు రాజమండ్రిలో మెగా జాబ్ మేళా

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 26: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న రాజమండ్రి వీఎల్‌పురంలోని మార్గాని ఎస్టేట్ ఆవరణలో మెగా రీజనల్ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పశ్చిమగోదావరి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలకు సంబందించి రాజమండ్రిలో జాబ్‌మేళా నిర్వహిస్తునట్లు తెలిపారు. 120కి పైగా కంపెనీలు పాల్గొని సుమారు 400పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. ఇతర వివరాలకు చక్రధర్ రెడ్డి 96031 61039ను సంప్రదించాలన్నారు.

మార్చి 11 నుంచి పెద్దింటమ్మ జాతర

కైకలూరు, ఫిబ్రవరి 26: కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి జాతర మహోత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు కైకలూరులో ఆవిష్కరించారు. మార్చి 11 నుంచి 24 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. అలాగే మార్చి 8న గోకర్ణపురంలోని గోకర్ణేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఆవిష్కరించారు. శివరాత్రి ఉత్సవాలకు గోకర్ణపు రంలో విస్తృతస్థాయి ఏర్పాట్లను నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ అధికారి కేవీ గోపాలరావు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

మంగళగిరి తరలిన టీడీపీ శ్రేణులు

చాట్రాయి, ఫిబ్రవరి 26: నూజివీడు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి పార్టీలో చేరుతున్న సందర్భంగా మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయానికి సోమవారం చాట్రాయి మండలం నుంచి తెలుగు తమ్ముళ్లు భారీగా తరలివెళ్లారు. అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు 30 కార్లలో తరలివెళ్లారు.

ఆచంట వేమవరంలో అనారోగ్యంతో యువతి మృతి

డెంగీతో మృతి అంటూ సోషల్ మీడియాలో వార్తలు

ఆచంట, ఫిబ్రవరి 27: ఆచంట మండలం ఆచంట వేమవరానికి చెందిన బొమ్మిశెట్టి వెంకన్న కుమార్తె కావ్యశ్రీ (22) రెండు రోజులు క్రితం అనారోగ్యంతో చికిత్స పొందుతూ భీమవరం ఆసుపత్రిలో మృతి చెందింది. అయితే కావ్యశ్రీ కొన్నినెలలుగా కిడ్నీలో రాళ్ళున్న కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందింది. అందుకోసం మొదట పాలకొల్లు ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్స చేయిస్తుండగా మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి భీమవరం తరలించి చికిత్స చేయిస్తున్నారు. రెండు రోజులు క్రితం కావ్యశ్రీ మృతి చెందింది. డెంగ్యూ కారణంగానే కావ్యశ్రీ మృతి చెందిందని సోషల్ మీడియాలో వార్తలు రావడంతో వైద్య అధికారులు స్పందించారు. డెంగీతో మృతి చెందలేదని అనారోగ్యంతోనే మృతి చెందిందని చెబుతున్నారు.


గోదావరిలో బాట ఏర్పాటు ..ఇసుక డ్రెడ్జింగ్ పనులు


టికెట్ కౌంటర్లు, చలువు పందిళ్ల ఏర్పాటు

పట్టిసీమ మహా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

పోలవరం, ఫిబ్రవరి 26 : మహా శివరాత్రి ఉత్సవాలకు పట్టిసీమ క్షేత్రంలో ఏర్పాట్లను అధికారులు వేగవంతం చేశారు. పట్టిసీమ ఫెర్రీ రేవు భక్తుల రాకపోకలకు అనువుగా లేకపోవడంతో ఐదేళ్ళ నుంచి కన్నాపురం అడ్డ రోడ్డుకి సమీపంలో ఉన్న రివర్ ఇన్ అతిథి గృహం రేవు వద్ద నదిపై రాకపోకల కోసం పంట్లతో వంతెన, ఇసుక బస్తాలు, తడికలలతో నడక మార్గం వేసే పనులు వేగవంతం చేస్తున్నారు. నదికి ఆవలి వైపు నుంచి ఇసుకను డ్రెడ్జింగ్ చేసి వెదురు తడికలు బాదులతో మార్గం వేసే పనులు వేగవంతం చేశారు. నదికి ఇవతల వైపు టికెట్ కౌంటర్లు , ఇతర శాఖల అధికారుల కౌంటర్ల నిర్మాణం వేగంగా జరుగుతున్నాయి. ఇవతల ఒడ్డు నుంచి నదిపై 340 అడుగుల మేర పంట్లతో కొంతమేర వంతెన నిర్మించి నదికి అవతలి వైపు నుంచి 400 మీటర్ల మేర డ్రెడ్జింగ్ ద్వారా ఇసుక బస్తాలు, తడికలతో నడకమార్గం ఏర్పాటు చేయనున్నారు. నది దాటిన తర్వాత సుమారు 600 మీటర్ల మేర ఇసుకతిన్నెల్లో భక్తులు నడక మార్గాన ఆలయానికి చేరుకోవలసి ఉంటుంది. పట్టిసీమ ఎత్తిపోతల పథకం వద్ద ఆర్టీసీ బస్టాండు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో భక్తులు ఆలయానికి రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణించవలసి ఉంటుంది. వృద్ధులు, దివ్యాంగులు నదీ తీరం నుంచి ఆలయం వరకూ తీసుకెళ్ళేందుకు వాహన సదుపాయం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.



భీమడోలు అండర్ పాస్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో పాల్గొన్న బీజేపీ నాయకులు .. అత్తిలి ప్రారంభ సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలు ప్రారంభం

అత్తిలి / దెందులూరు /భీమడోలు, ఫిబ్రవరి 25 : అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా అత్తిలి మండలం ఆరవల్లి, మంచిలి గ్రామాల్లో నిర్మించిన రైల్వే అండర్ పాస్‌లను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సోమవారం వర్చువల్ విధానంలో ప్రారంభించి జాతికి అంకితం చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ అన్నారు. అమృత భారత్ స్టేషన్ పథకంలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ దేశ వ్యాప్తంగా 554 రైల్వే స్టేషన్లు, 1500 ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్‌పాస్‌లు ప్రారంభించి చేసి జాతికి అంకితం చేశారన్నారు. ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, మండల నాయకులు బాలం మహేష్, శ్రీధర్‌రెడ్డి, ఆరవల్లి ఉప సర్పంచ్ వెలగల అమ్మిరెడ్డి, జడ్పీటీసీ అడ్డాల జానకి, వైస్ ఎంపీపీ దాసం సునీత,డీఆర్‌సీ సభ్యులు జక్కంశెట్టి కుమార్, రైల్వే అధికారులు సుబ్బారావు, నారాయణరావు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

- రైల్వే వ్యవస్థ బలోపేతానికి ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని దక్షిణ మధ్య రైల్వే బోర్డు జోనల్ డైరెక్టర్ గుమ్మడి వెంకట చైతన్య కృష్ణ అన్నారు. దేశవ్యాప్తంగా ప్రారంభించిన రోడ్డు ఓవర్ బ్రిడ్జిలను, అండర్ పాస్ బ్రిడ్జిలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. సోమ వారం దెందులూరు,-అలుగులగూడెం మధ్య రూ.5 కోట్లతో నూతనంగా నిర్మించిన రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జిని ప్రారంభించారు. కొఠారు రామచంద్రారావు, సర్పంచ్ యేసమ్మ, జడ్పీటీసీ లీలా నవకాంతం, మోటపర్తి రాంబాబు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.
- భీమడోలు మండలంలోని కురెళ్ళగూడెం-అంబర్‌పేట గ్రామాలను కలుపుతూ 6.91 లక్షల వ్యయంతో కేంద్ర రైల్వే శాఖ నిర్మించిన అండర్ పాస్ బ్రిడ్జి సోమవారం ప్రారంభమైంది. బీజేపీ నాయకులతో పాటు విజయవాడ డివిజన్ రైల్వే ఏడీఈ చంద్రరావు పాల్గొన్నారు. బీజేపీ నాయకులు శరణాల మాలతీ రాణి, కోకన్వీ నర్ వెజ్జు ధర్మారావు, అడపా శోభారాణి, ప్రవీణ్ కుమార్‌పటేల్, పులి వీరరాఘవులు, వర్ధినీడి కపిరాజు, గంధం భాస్కరరావు, పాల్గొన్నారు.


అలుగులగూడెంలో పాల్గొన్న బీజేపీ నాయకులు, రైల్వే అధికారులు


ఏడీఆర్‌ను అభినందిస్తున్న శాస్త్రవేత్తలు, సిబ్బంది,

మార్టేరు వరి పరిశోధనా స్థానం ఏడీఆర్‌గా డాక్టర్ శ్రీనివాస్

పెనుమంట్ర, ఫిబ్రవరి 26 : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం మార్టేరు పరిశోధన సహసంచాలకులుగా డాక్టర్ డి.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఏడీఆర్‌గా పనిచేసిన భరత లక్ష్మి వైరా వ్యవసాయ కళాశాలకు వెళ్లారు. శ్రీనివాస్ 2007 నుంచి 2019 వరకు మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్తగా పనిచేసిన అనుభవం ఉంది. 15 సంవత్సరాలు పరిశోధనలో, పది సంవత్స రాలు వ్యవసాయ కళాశాలలో పనిచేశారు. 18 నెలలు విద్యాలయం అసోసియేషన్ డీన్‌గా పనిచేశారు. 14 నెలలు బాపట్ల కళాశాలలో ప్రధాన శాస్త్రవేత్తగా పనిచేసి పదోన్నతిపై మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏడీఆర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు పలువురు శాస్త్రవేత్తలు, పరిశోధనా స్థానం సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.



మోటార్ బైక్ దగ్ధం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 26: రహదారిపై వెళ్తున్న ఓ మోటార్‌బైక్ నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. సోమవారం కామవరపుకోట మండలం వడ్లపల్లికి చెందిన రామిశెట్టి నరేష్ తన స్నేహితునితో కలసి సొంతపనిపై ద్వారకాతిరుమల వచ్చాడు. పని ముగించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమవగా గుండుగొలనుకుంట వద్దకు వచ్చేసరికి బండి వెనుక నుంచి పొగ, మంటలు వస్తుండడం గమనించి బైక్ ఆపి దూరంగా పరుగులు తీశారు. అయితే బైక్ ఉంచి దట్టమైన పొగలతో మంటలు చెలరేగి దగ్ధమైంది. విద్యుత్ సర్క్యూట్ లోపం కారణంగా ఇలా జరిగి ఉండొచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

క్రైం కార్నర్

కైకరం వద్ద ట్రాక్టర్ పల్టీ..డ్రైవర్ మృతి

ఉంగుటూరు,ఫిబ్రవరి 26 : ఉంగుటూరు మండలం కైకరం వద్ద ట్రాక్టర్ టైరు పేలడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన డ్రైవర్ మానెల్లి నాగరాజును (30) తాడేపల్లిగూడెం అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు చేబ్రోలు ఎస్ఐ మణికుమార్ తెలిపారు. దువ్వ నుంచి దొరసానిపాడు గ్రామానికి వెళుతుండగా కైకరం శివారులో ప్రమాదం జరిగింది.

గ్యాస్ బండలు స్వాధీనం



ఏలూరు క్రైం, ఫిబ్రవరి 26 : గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ బండ్లను ఒక హోటల్‌లో వినియోగిస్తున్నారని ఏలూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి (ఎస్పీ) కరణం కుమార్‌కు అందిన సమా చారంతో విజిలెన్సు అధికారులు దాడి చేశారు. ఏలూరు పత్తేబాద ప్రాంతంలో ఉన్న సాయిగణేష్ టిఫిన్ సెంటర్‌లో సబ్సిడీ గ్యాస్ సిలెండర్లను హోటల్‌లో వినియోగిస్తున్నారన్న సమాచారంతోతో సోమవారం తహసీల్దార్ కన్యాకుమారి, ఎస్ఐ రంజిత్‌కుమార్, రెవెన్యూ పౌరసరఫరాల అధికారులు దాడి చేశారు. ఆరు గ్యాస్ సిలెండర్లను స్వాధీనం చేసుకుని హోటల్ యజమాని తమ్మిరెడ్డి వెంకట శివ దుర్గాప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న గ్యాస్ బండల విలువ 16 వేల రూపాయలు అని తెలిపారు.

బైక్‌లు ఢీ.. వృద్ధునికి తీవ్ర గాయాలు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 25 : రౌతుగూడెం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన చిన్నరాములు మోపెడ్‌పై వెళుతుండగా ఎదురుగా పల్సర్ బైక్‌పై వస్తున్న మరో యువకుడు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తలకు ముఖంపై తీవ్ర గాయాలైన చిన్నరాముల్ని బుట్టాయగూడెం 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

అదృశ్యమైన బాలుడు దొరికాడు



ఏలూరు క్రైం, ఫిబ్రవరి 26 : తల్లి ఊరు తీసుకు వెళ్ళలేదని కోపగించుకున్న బాలుడు ఇంటి నుంచి బయటకు వెళ్ళిపోయాడు. ఈ సంఘ టనపై ఆ బాలుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడంతో పోలీసులు వెంటనే స్పందించి గంటల వ్యవధిలోనే బాలుడి ఆచూకీ కనుకొని తండ్రికి అప్పగించారు. ఏలూరు కత్తేపువీధికి చెందిన పొన్నంటి మురళీకి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇస్త్రీ బండి పెట్టుకుని కుటుంబాన్ని పోషిస్తున్నారు. గుంటూరులో బంధువుల్లో ఒకరికి ఆరోగ్యం బాగోలేదని చూడడానికి మురళీ భార్య తన కుమార్తెను తీసుకుని సోమవారం బయలుదేరింది. తనను కూడా తీసుకువెళ్ళాలంటూ చిన్న కుమారుడు మణికంఠ మారాం చేశాడు. అతినిని ఇంటి వద్ద పెట్టి ఆమె ఊరు వెళ్ళిపోయింది. మురళీ ఇస్త్రీ బండి వద్దకు వెళ్ళిపోయాడు. మురళీ ఇంటికి వచ్చి చూసేటప్పటికి కుమారుడు మణికంఠ కనిపించలేదు. ఎంత వెతికినా అతని ఆచూకీ కానరాకపోవడంతో ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు మురళీ ఫిర్యాదు చేశాడు. దీంతో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ పర్యవేక్షణలో ఎస్ఐ నవీన్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ అప్పన్న వెంటనే నగరంలో గాలింపు చేపట్టారు. చివరకు బాలుడి ఆచూకీ కనుగొని స్టేషన్‌కు తీసుకువచ్చి తండ్రి మురళీకి అప్పగించారు.

బంగారం దొంగలను పట్టేశారు

ఐదు రోజుల్లో కేసును ఛేదించిన పోలీసులు

12 మంది నిందితులు.. 9 మంది అరెస్టు

రూ.2 కోట్ల విలువైన 3.50 కిలోల బంగారం రికవరీ


రికవరీ చేసిన ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 26 : సినీ ఫక్కీలో దోపిడీకి పాల్పడిన దొంగలను పోలీసులు పట్టేశారు. ఆ వివరాలను తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ జగదీశ్ సోమవారం వెల్లడించారు. భీమవరానికి చెందిన బాలు నాథూరామ్ బంగారం షాపుల నుంచి వచ్చే ఆర్డర్ల ప్రకారం ఆభరణాలను సరఫరా చేసే వ్యాపారం చేస్తున్నారు. ఈనెల 21న తన కారులో ఆభరణాలు షాపులకు ఇవ్వడానికి దూబచర్ల,జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం బయలు దేరారు. చీకటి పడుతున్న సమయంలో కొయ్యలగూడెం దాటిన తర్వాత ఇన్నోవాలో ఐదుగురు దుండగులు వచ్చి తాము ఇన్‌కంట్యాక్స్ అధికారులమంటూ నాథూరామ్‌ని ఆపారు. వేరే కారులో తీసుకు వెళ్లి లాలాచెరువు వద్ద దింపేశారు. కారులో రూ.2 కోట్ల విలువైన మూడున్నర కిలోల బంగారు ఆభరణాలు, రూ.5 లక్షల నగదు కొట్టేసి కారు అక్కడే వదిలేశారు. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. ఎస్పీ జగదీశ్ స్వీయ పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. దర్యాప్తులో కొందరు అను మాస్పద వ్యక్తులు ఇన్నోవాలో విజయవాడ వైపు వెళ్తున్నారనే సమా చారంతో తనిఖీలు నిర్వహించి 12 మందిని నిందితులుగా గుర్తించామని ఎస్పీ వివరించారు. వీళ్లలో జంగారెడ్డిగూడేనికి చెందిన చలపాక వెంకటేశ్, మద్దిపాటి కల్యాణ్, కోడూరి రవితేజ, కోనా శ్రీనివాస్, వేముల మంజుబాబు,షేక్ నాగూర్ మీరావలి, వేముల మోహన్‌సాయి, మోహన్ నారాయణ్ కుంబాకర్, పమిడిపల్లి బ్రహ్మ జీలను అరెస్టు చేశామన్నారు. వీరందరూ పాత నేరస్తులని, నగల వ్యాపారం చేసేవాళ్ళు, తయారీదారులు కూడా ఉన్నారన్నారు. నాథూరామ్ అనుపానువులు గమనించి రెక్కీ నిర్వహించి పథకం ప్రకారం దోపిడీకి దిగారన్నారు. మరో ముగ్గురి కోసం గాలిస్తున్నామని తెలిపారు. సుమారు రూ.2 కోట్ల విలువైన 181 బంగారు గొలుసులు, కరిగించిన బంగారు కడ్డీలు మొత్తం 3.50 కిలోల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులో ప్రతిభ చూపిన కొవ్వూరు డీఎస్పీ రామారావు, నార్త్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, నల్లజర్ల సీఐ కె.దుర్గాప్రసాద్, రాజమహేంద్రవరం సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు కె.రజనీకుమార్, కె.విజయబాబు, ఉమామహేశ్వరరావు, దేవరపల్లి ఎస్ఐ కె.శ్రీహరి, టీవీ సురేశ్, ఐటీ కోర్ ఎస్ఐ ఎం.అయ్యప్పరెడ్డి తదితర సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.


హుండీల ఆదాయం లెక్కింపు జరుపుతున్న సిబ్బంది

చిన వెంకన్న హుండీ ఆదాయం రూ 2.39 కోట్లు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 26: ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి హుండీల ఆదాయం గడచిన 28 రోజులకు గాను రూ.2.39 కోట్లు సమకూరింది. ప్రమోద కల్యాణమండప ఆవరణలో సోమవారం భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించారు. 2 కోట్ల 39 లక్షల 33 వేల 108 రూపాయల నగదుతో పాటు భక్తులు సమర్పించిన కానుకల రూపేణా 424 గ్రాముల బంగారం, 5.674 కేజీల వెండి లభించినట్లు ఈవో త్రినాథరావు తెలిపారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (30), 1000(2), 2000 (13)తో పాటు విదేశీ కరెన్సీ లభించింది.


సచివాలయ భవనం.. వైసీపీ కార్యకర్తల పేరుతో వేసిన శిలాఫలకానికి పేపర్‌తో మూతవేసిన దృశ్యం (ఇన్‌సెట్‌లో)

కృష్ణాయపాలెంలో ప్రోటోకాల్ రగడ

వైసీపీ కార్యకర్తల పేరున శిలాఫలకం

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 26 : తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెంలో సచివాలయ భవనం వద్ద వైసీపీ కార్యకర్తల అతితో ప్రోటోకాల్ రగడ రాజుకుంది. సచివాలయ భవనం వద్ద ప్రారంభోత్సవానికి వైసీపీ కార్యకర్తలతో కూడిన శిలాఫలకం వేయడంతో సర్పంచ్ బేతపూడి వెంకట సుబ్బలక్ష్మి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు తాత్కాలికంగా ప్రారంభోత్సవ సమయానికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు శిలాఫలకం కనిపించకుండా పేపర్ అంటించారు. తాత్కాలికంగా శిలాఫలకం మూతవేసినా తర్వాత ఆ శిలాఫలకం ఉంచితే ఇబ్బందులు తప్పవని టీడీపీ నాయకులు హెచ్చరించారు. దీనిపై పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాల్‌ను వివరణ కోరగా సచివాలయ కమిటీ పేరుతో తమకు తెలియకుండా కార్యకర్తలు వేసుకున్నారని ఆ పేర్లు తీసేయాలని చెప్పామన్నారు. తాత్కాలికంగా ఆ శిలాఫలకానికి పేపర్ మూత వేశామని ప్రారంభోత్సవం కాగానే శిలాఫలకం తీసేస్తామన్నారు.

మార్చి 16వ తేదీకి లోక్ అదాలత్ మార్పు


సమావేశంలో మాట్లాడుతున్న పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్‌పర్సన్ గ్రేస్ కుమారి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 26 : మార్చినెల 9వ తేదీన జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను మార్చి 16వ తేదీకి మార్చినట్టు శాశ్వత లోక్‌అదాలత్ చైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారి తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ నుంచి సోమవారం అందిన ఉత్తర్వులు మేరకు మార్చి 9న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను మార్చి 16వ తేదీకి మార్చినట్టు తెలిపారు. జిల్లాలోని న్యాయవాదులు, కక్షిదారులు, అధికారులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. ఏలూరు జిల్లా న్యాయధికార సంస్థలో ప్రతిరోజు ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌లు నిర్వహిస్తారని కేసులను పరిష్కరించుకోవడానికి రావాలని సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌లో భార్యభర్తల వివాద కేసుల్లో విచారించామని ఇరువురు కలిసి కాపురం చేసుకునే విధంగా కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ చేశామన్నారు.ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కక్షిదారు లందరూ ఈ ప్రీసిట్టింగ్ లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలన్నారు.

3న పల్స్ పోలియోకు ఏర్పాట్లు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 26 : రెండు పోలియో చుక్కలు నిండు నూరేళ్ల రక్ష అని, పల్స్ పోలియోను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. డి. మహేశ్వర రావు అన్నారు. వచ్చేనెల 3వ తేదీన జిల్లాలో జరిగే పల్స్ పోలియోపై సమీక్షించారు. తొలి రోజు పోలియో చుక్కలు పొందని పిల్లల కోసం4,5వ తేదీలలో సిబ్బంది ఇంటింటికి వెళ్ళి పోలియో చుక్కలు వేయాలన్నారు. జిల్లాలో 5 సంవత్సరాల లోపు పిల్లలు 1,85953 మంది వున్నారని తెలిపారు.


హత్యకు గురైన మేడూరి దుర్గ ...హత్యా స్థలంలో పరిశీలిస్తున్న పోలీస్ జాగిలం క్లూస్ టీం

పోలవరంలో మహిళ దారుణ హత్య

పోలవరం, ఫిబ్రవరి 26 : ప్రశాంతంగా ఉండే పోలవరం ఆదివారం రాత్రి జరిగిన హత్యతో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పోలవరం మండలం పోలవరం పంచాయతీ కొత్తరామయ్యపేటలో ఒక మహిళను గుర్తు తెలియని దుండగులు గొంతుకోసి చంపారు. పోలవరం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం కొత్తరామయ్యపేట పునరావాస కాలనీకి చెందిన మేడూరి దుర్గ (38) వ్యవ సాయ కూలీలకు మేస్త్రిగా ఉంటూ గ్రామంలో కూలీలను ఇతర గ్రామాలకు కూలి పనులకు తీసుకెళుతూ ఉండేది. ఆదివారం తన ఇంటివద్ద కొందరు కూలీలకు కూలి సొమ్ములు ఇచ్చింది. మిగిలిన సొమ్ములు ఇంట్లో బీరువాలో దాచింది. ఆదివారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో ఆమె కుమారుడు ఇంటికి రాగా వాకిట్లో రక్తపు మడుగులో తన తల్లి పడి ఉండడం చూసి తండ్రికి తెలిపారు. బీరువాలో ఉండాల్సిన సొమ్ము కూడా కనిపించ లేదు. మృతురాలి భర్త ముత్యాలరావు పోలీసులకు సమాచారం అందించగా డీఎస్పీ సురేష్‌కుమార్ రెడ్డి, సీఐ గుమ్మళ్ళ మధు బాబు, ఎస్సై సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. కూలి పనుల సొమ్ముల విషయం తెలిసిన వారే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఏలూరు జిల్లా కేంద్రం నుంచి పోలీస్ జాగిలాలను, క్లూస్ టీం, ఫోరెన్సిక్ నిపుణులను రప్పించి పోలీసులు విచారణ చేపట్టారు. పోలీస్ జాగిలం ఇంటి పరిసరాలు, సమీపంలో మామిడితోటలో తిరుగాడింది. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలవరం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించి కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ కార్యాలయం వద్ద ఇంజనీర్ల నిరసన

పంచాయతీ రాజ్ ఇంజనీర్ల నిరసన

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 26: పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల సమస్యలు పరిష్కరించాలని, ఎస్‌ఎఫ్‌టీ పనులపై విజిలెన్స్ విచారణ నిలుపుదల చేయాలని సోమవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పీఆర్ ఇంజనీర్స్ జేఏసీ చైర్మన్ ఉప్పలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఇంజనీరింగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనుల నిమిత్తం కేంద్రం ఇచ్చే 3శాతం అడ్మినిస్ట్రేటర్ చార్జీలు, రెండేళ్లుగా నిలుపుదల చేసిన వాహన బిల్లులు, ఎఫ్‌టిఏ, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో ఎస్‌ఎఫ్‌టి పనులపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ చేసి అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారని, ఆ నివేదిక ప్రకారం చర్యలు తీసుకోకుండా గతంలో ప్రిన్సిపల్ సెక్రటరి, మంత్రి ఇచ్చిన హామీ నేటికి నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్.మురళీకృష్ణ, ఎం.విజయ్ కుమార్, రమణమూర్తి, డీఈలు సురేష్, లీలామోహన్, తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు సకాలంలో పరిష్కరించాలి : కలెక్టర్


సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 26: స్పందన కార్యక్రమంలో అందిన అర్జీల్లో సమస్యలు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జేసీ బి.లావణ్యవేణి, డీఆర్వో పుష్పమణి, హౌసింగ్ పీడీ కె.రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ్‌రాజు, ఎస్ఎస్ఏ పీవో బి.సోమశేఖర్, ఆర్డీవో ఖాజావలీ అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన విజ్ఞప్తులు గడువులోగా పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాత పరిష్కార విధానంపై ప్రజలు సంతృప్తిచెందకపోవడంతో దరఖాస్తులు రీఓపెన్ అవుతున్నాయన్నారు. స్పందన కార్యక్రమంలో 218 అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైద్య ఉద్యోగుల సమస్యలపై 'స్పందన'

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు మంగళవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్యాధికారి శర్మిష్ఠ సోమవారం తెలిపారు. ఉద్యోగులు తమ సమస్యలను నేరుగా తెలియజేసి పరిష్కారం పొందవచ్చన్నారు.

అపరిచితుల మెసేజ్‌లతో చిక్కులు తప్పవు : ఎస్పీ


ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 26: సోషల్ మీడియా ద్వారా అపరిచితులు పంపించే లింకులు, మెసేజ్‌లతో చిక్కులు తప్పవని, అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మేరీ ప్రశాంతి సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరించారు. 50 మంది ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. చట్ట ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అపరిచితులు వాట్సాప్, టెక్ట్ మెస్సేజ్‌లు పంపితే వాటిని ఓపెన్ చేయవద్దని సూచించారు. ఓటీపీ నెంబర్ ఎవరికి చెప్పవద్దని ఎస్పీ సూచించారు.

రజకులకు ప్రాధాన్యం ఇచ్చిన పార్టీకే మద్దతు


సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 26: రజకులను రాజకీయ పార్టీలు ఓటుబ్యాంకుగానే చూస్తున్నాయని, వచ్చే ఎన్నికల్లో రజకులకు ప్రాధాన్యం ఇచ్చిన పార్టీకే తమ మద్దతు ఉంటుందని రజక జన సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. ఏలూరులో సోమవారం జరిగిన రజక జన మహాసభలో ఆయన మాట్లాడారు. రజకులు వృత్తి పరమైన సమస్యలతో ఇబ్బంది పడుతున్నా ప్రజాప్రతినిధులు కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. రజకులు రాజకీయంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం పలుతీర్మానాలు చేసి ఆమోదించారు. సమావేశంలో పరిటాల శ్రీనివాసరావు, పి.సాంబశివరావు, జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు చర్యలు తీసుకోవాలి


పీహెచ్‌సీలో డీఎంవో, వైద్యాధికారులు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 26: మలేరియా కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలని డీఎంవో (జిల్లా మలేరియా అధికారి) సురేష్ సూచించారు. జీలుగుమిల్లి పీహెచ్‌సీలో ల్యాబ్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో మలేరియా పాజిటివ్ కేసులపై ఆరా తీశారు. ఒక విద్యార్థికి మలేరియా పాజిటివ్ గుర్తించినట్లు సిబ్బంది చెప్పారు. ల్యాబ్‌లో రక్త పరీక్షలు, రికార్డులు, మందుల నిల్వలు పరిశీలించారు. వైద్యాధికారి గాయిత్రి, సీహెచ్‌వో సీహెచ్.శ్రీనివాసరాజు, మంగతాయారు, నాగేశ్వరరావు ఉన్నారు.

పెండ్లి సంబంధాల మధ్యవర్తుల సంక్షేమ సంఘం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 26: పెండ్లి సంబంధాలు కుదిర్చే వారిని మ్యారేజ్ బ్రోకర్‌గా సంబోధించడం తగదని ఆంధ్ర రాష్ట్ర ఐక్యత వివాహ మధ్యవర్తుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. వైఎంహెచ్ఏ ప్రాంగణంలో సోమవారం నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులుగా శోభారాణి, ఉపాధ్యక్షులుగా అత్తిలి శ్రీనివాసరావు, సెక్రటరిగా చిట్టిమూరి రత్నరాజు, జాయింట్ సెక్రటరీగా వేముల సూర్యనారాయణ, ట్రెజరర్‌గా గంగాధర్‌రావు, సభ్యులుగా తలమాల యిర్మియ, రత్నాకరం రామరాజు, మహ్మద్ ఆలీ ఎంపిక అయ్యారు. శోభారాణి మాట్లాడుతూ బ్రోకర్ పదాన్ని ప్రభుత్వం నిషేధించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం మ్యారేజ్ మీడియేటర్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.


డబ్ల్యూటీవో ఒప్పంద ప్రతులను దహనం చేస్తున్న రైతులు

ఉపాధి హామీ పనులు కల్పించాలి

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 26: నిరుపేదలు, వ్యవసాయ పనులు చేసుకునే కూలీలకు ప్రభుత్వం ఉపాధి లేకుండా చేసిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ విమర్శించారు. సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఉపాధి కూలీలు, మహిళలతో సోమవారం ధర్నా నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులకు, పేదలకు ఉపాధి హామీ పనులే దిక్కు అని, రాష్ట్రప్రభుత్వం 2020లో ఏలూరుచుట్టూ పక్కల ఏడు గ్రామ పంచాయతీలను నగరంలో విలీనం చేయడంతో ఉపాధి పనులు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 6వేల కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉన్నాయని, 2020 నాటికి 10 వేల మంది కూలీలు ఉన్నారని, ప్రభుత్వం లెక్కలు చెబుతున్నా అధికార పార్టీ నాయకులు పట్టించుకోలేదన్నారు. పేద కుటుంబాలకు ఉపాధి లేక పట్టణాలకు వలస పోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఏడు పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి.దుర్గ, బి.ప్రేమకు మారి, బి.నిర్మల, వనరాజ్యం, పి.వజ్రం, లక్ష్మణుడు, బి.పాప, 200మందికి పైగా ఉపాధికూలీలు, మహిళలు పాల్గొన్నారు.

పునరావాస పరిహారం అందించాలి

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 41.15 కాంటూర్ లెవల్‌లో మాధవరం గ్రామానికి పునరావాస పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాధవరం నిర్వాసితులకు పునరావాస కాలనీలో ఇళ్లను కేటాయించి, ప్రస్తుతం కోల్పోతున్న ఇళ్లకు, వ్యక్తిగత ప్యాకేజీ ఇచ్చి త్వరగా తరలించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రాచమడుగు వరలక్ష్మి, నిరంజన్, నిర్వాసితులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్, ఎత్తిపోతల నిర్వాసితులకు న్యాయం చేయాలి

చింతలపూడి: గ్రీన్‌ఫీల్డ్ హైవే, చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్వాసిత రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని, ప్రభుత్వం, అధికారులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ భూములు కోల్పోయిన రైతులకు తీరని అన్యాయం జరిగినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గం అన్నారు. మోసపూరిత వాగ్దానాలు ఇవ్వడం తప్ప రైతులకు చేసిందేమీలేదన్నారు. కలెక్టర్ హామీ మేరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతులకు ఆర్బిట్రేషన్ జడ్జిమెంట్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వీసు రోడ్లు, అండర్ పాస్‌లు వేయాలని, బోర్లు, విద్యుత్ లైన్లు, ఉద్యాన వన పంటలు కోల్పోయిన రైతులకు పరిహారం పెంచి ఇవ్వాలని కోరారు. ఎత్తిపోతల పథకం నిర్వాసితులను ఐదేళ్లుగా ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కొత్త నోటిఫికేషన్ ఇచ్చి మార్కెట్ ధర ప్రకారం రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈ పథకాన్ని పూర్తి చేసి రైతులకు సాగునీరు, మెట్ట ప్రాంతాలకు తాగునీరు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల భూములను ప్రస్తుతం రెవెన్యూ రికార్డులలో బ్లాక్ లిస్టు నుంచి తొలగించాలన్నారు. అనంతరం డీటీ షకీలున్నీసాకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు ఆర్‌వీఎస్.నారాయణ, ఎత్తిపోతల పథకం కమిటీ నాయకులు చిట్టూరి అంజిబాబు, సత్యనారాయణ, గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసిత కమిటీ నాయకులు శ్రీనివాసరావు, కె.మల్లికార్జునరావు, రామకృష్ణ, వి.రాజేంద్రప్రసాద్, చిలుకూరి శ్రీహరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పనులు కల్పించాలని కలెక్టరేట్ వద్ద ఉపాధి కూలీల ధర్నా

సమస్యల హోరు

రైతు, కార్మికులు, నిర్వాసితుల ఆందోళన


చింతలపూడిలో ర్యాలీలో మాట్లాడుతున్న వసంతరావు

డబ్ల్యూటీవో ఒప్పందాల నుంచి వైదొలగాలి

ఏలూరు టూటౌన్: రైతాంగానికి, కార్మికులకు దేశప్రజలకు నష్టం కలిగించే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)లో ఒప్పందాల నుంచి భారత్ వైదొలగాలని సంయుక్త కిసాన్ మోర్చ నాయకులు డిమాండ్ చేశారు. వసంత మహల్ సెంటర్‌లో రైతు, కార్మిక, వ్యవసాయ, ప్రజా సంఘాలు డబ్ల్యూటీవోతో ఒప్పంద ప్రతులను దహనం చేశారు. రైతాంగానికి, కార్మికులకు నష్టం కలిగించేవిధంగా మోదీ ఒప్పందం చేసుకోవడం దుర్మార్గమన్నారు. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలన్నారు. విదేశీ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులకు పూర్తిగా సుంకాలు ఎత్తివేయడంతో పంటల ధర పడిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఈకేఎంయూ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు సాయిబాబా, ఏఐటీయూసీ నాయకులు అప్పలరాజు పాల్గొన్నారు.

● చింతలపూడి: కేంద్ర ప్రభుత్వం డబ్ల్యూటీవోతో ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని అఖిలపక్ష రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. సీపీఐ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జిల్లా నాయకులు ఎం.వసంతరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఒప్పందం వలన రైతాంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. ఆహార పదార్థాలపై దిగుమతి సుంకం ఎత్తివేయడం ధరలు పడిపోయాయని, ఉత్పత్తి ఖర్చులు పెరుగుతున్నాయన్నారు. ఈ ఒప్పందం వలన పీడీఎస్ పథకాన్ని రద్దు చేస్తున్నారని, ఆహార భద్రత చట్టానికి నష్టం వాటిల్లుతుందన్నారు. దీంతోపాటు వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం దెబ్బతింటుందని ఈ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వి.సుందరరావు, పున్నారి సోమశేఖర్, డి.కృష్ణ, రంగనాథ్, కంచర్ల గురవయ్య, ఆర్.వి.సత్యనారాయణ, టి.బాబు, జె.రామచంద్రారెడ్డి, ఎస్‌కె.కాలేషా, టి.ప్రసాద్, పలువురు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన సభ విజయవంతం చేయాలి


సభ ఏర్పాట్లపై బొలిశెట్టి, ధర్మరాజు సూచనలు

ఉంగుటూరు, ఫిబ్రవరి 26: తాడేపల్లిగూడెంలో ఈ నెల 28న జరిగే జనసేన, టీడీపీ ఉమ్మడి బహిరంగ సభ ఏర్పాట్లపై సోమవారం జనసేన నేతలు కార్యకర్తలతో చర్చించారు. ఉంగుటూరు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పత్సమట్ల ధర్మరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, జనసేన ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి బండి రమేష్ కార్యకర్తలకు పలు సూచనలు ఇచ్చారు. సభ విజయవంతం చేయాలని కోరారు.

● చింతలపూడి: తాడేపల్లిగూడెంలో జరిగే జనసేన, తెలుగుదేశం పార్టీ సభను జయప్రదం చేయాలని జనసేన నియోజకవర్గ కన్వీనర మేకా ఈశ్వరయ్య కోరారు. నియోజకవర్గంలోని జంగారెడ్డిగూడెం, చింతలపూడి, కామవరపుకోట, లింగపాలెం మండలాల నుంచి జనసేన నాయకులు, వీర మహిళలు, అభిమానులు భారీగా పాల్గొని ఈ సభను జయప్రదం చేయాలని, సభలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పాల్గొంటారని ఆయన తెలిపారు.

ముగిసిన కోటి కుంకుమార్చన

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 26: రామకోటి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 23 నుంచి జరుగుతున్న లలితా సహస్రనామ కోటి కుంకుమార్చన సోమవారం ముగిసింది. అమ్మవారికి ఆవాహన, అష్టోత్తర సహస్రనామ పూజ నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మైలవరపు లక్ష్మీనరసింహం ఆధ్యాత్మిక ప్రవచనం ఇచ్చారు. రామకోటి ఉత్సవ కమిటీ కార్యవర్గ సభ్యులు కొట్టు మధు వెంకట్రావు, గాదంశెట్టి రమేష్‌కుమార్, సురేష్‌కుమార్, మానేపల్లి రామారావు, పాదర్తి బాలకృష్ణ భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

వీరభద్రేశ్వరుడికి విశేష పూజలు

కామవరపుకోట, ఫిబ్రవరి 26 : స్థానిక భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. ఈ ఉత్సవాలు మార్చి 2 వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలియజేశారు.

మేడబడిలో ఘంటసాల గీతాలాపన


మెమెంటో ఇస్తున్న రిటైర్డ్ అడిషినల్ డీజీపీ

చింతలపూడి, ఫిబ్రవరి 26: ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి పురస్కరించుకుని మేడబడిలో ఘంటసాల గీతాలాపన చేశారు. పలు గ్రామాల గాయకులు ఘంటసాల పాటలతో అలరించారు. సంఘ నాయకులు వి.పూర్ణ చంద్రరావు మాట్లాడుతూ ఘంటసాల విగ్రహం ఏర్పాటుకు చింతలపూడికి చెందిన ఎన్ఆర్ఐ చిట్టూరి హరిబాబు విరాళం ప్రకటించారన్నారు. దాసోహం ఆచారి, బ్లెస్సింగ్ మోజెస్ మాట్లాడారు. గాయకులకు రిటైర్డ్ అదనపు డీజీపీ పూరేటి విజయానంద్ మెమెంటోలు అందజేశారు.

యువకుడి అదృశ్యం : తండ్రి ఫిర్యాదు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 26: కుమారుడి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. జంగారెడ్డిగూడెం పట్టణంకు చెందిన యనమనేని అరవింద్ ఐటీఐ చదివి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈనెల 23న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బంధువులు, చుట్టు ప్రక్కల వెనికి ఆచూకీ లభించకపోవడంతో సోమవారం తండ్రి రాజు ఇచ్చిన ఫిర్యాదుతో ఏఎస్ఐ మంగయ్య కేసు నమోదు చేశారు.

పాడి రైతుకు అటవీశాఖ పరిహారం


చెక్కు అందిస్తున్న జిల్లా అటవీశాఖ అధికారులు

పోలవరం, ఫిబ్రవరి 26: చేగొండపల్లి పంచాయతీ ఉడతపల్లిలో పులి దాడిలో ఆవుని కోల్పోయిన రైతు చూంద్రు వీరాయమ్మకు అటవీ శాఖ పరిహారం అందజేసింది. జిల్లా అధికారులు సోమవారం చెక్కు అందజేసినట్లు అటవీ క్షేత్రాధికారి ఎన్ దావీదురాజు తెలిపారు. పులి పాపికొండల నేషనల్ పార్కు పరిధిలో తిరుగుతుందన్నారు. పాపికొండల అభయారణ్యం సమీప ప్రాంత ప్రజలు పాడి పశువులను దూరంగా ఉంచుకోవాలన్నారు. గొర్రెల మందలను, పాడి పశువులను మేపడానికి అభయారణ్యంలోకి వెళ్లరాదని సూచించారు. పులి నేషనల్ పార్కులోకి వెళ్లినట్లు అటవీశాఖ అధికారులు ప్రకటించడంతో పోలవరం మండల అటవీ ప్రాంత ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

మృతుల కటుంబాలకు టీడీపీ సాయం

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 26: చంద్రబాబు నాయుడిని అరెస్టు చేసిన సమయంలో మనస్తాపానికి గురై చనిపోయిన మూడు కుటుంబాలకు పార్టీ నుంచి ఆర్థిక సహాయం అందినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్ తెలిపారు. ఎర్రంపేట గ్రామానికి చెందిన కన్నయ్య, బయ్యన్నగూడెం గ్రామానికి చెందిన మార్గని వెంకటేశ్వరరావు, కన్నాయిగూడెం గ్రామానికి చెందిన దిర్సిపోం వెంకటలక్ష్మి కుటుంబాలకు రూ.3లక్షలు చొప్పున కుటుంబ సభ్యుల ఖాతాలోకి జమ అయినట్లు ఆయన తెలిపారు.

మల్లిపూడికి సేవా నంది పురస్కారం


పురస్కారం అందుకున్న చినబాబూరావు

ఉంగుటూరు, ఫిబ్రవరి 26: ఉంగుటూరు పశువుల ఆసుపత్రిలో లైవ్ స్టాక్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మల్లిపూడి చిన బాబూరావు సేవా నంది పురస్కారం అందుకున్నారు. హైదరాబాదులోని ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమి వివిధ రంగాలలో సేవలందించిన వారిని ఈ పురస్కారాలకు ఎంపిక చేసింది. ఆదివారం జరిగిన కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ ప్రెసిడెంట్ ఈఎస్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పురస్కారం అందించారు. తెలంగాణ హైకోర్టు విశ్రాంత జడ్జి జి.చంద్రయ్య, మందాడి కృష్ణారెడ్డి, దైవజ్ఞ శర్మ, అకాడమి వైస్ చైర్మన్ ఈ.సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యాప్తికి ఉమాలక్ష్మి ట్రస్టు సేవలు


సంతాప సభలో నివాళి

దెందులూరు, ఫిబ్రవరి 25: పేదరికంతో చదువు మానివేసిన ప్రతిభ గల వందలాది మంది విద్యను కొనసాగించడానికి ఆకుల నరసింహరావు, ఉమాలక్ష్మి ట్రస్టు అందిస్తున్న సేవలు మరువలేనివని పలువురు పేర్కొన్నారు. ట్రస్టు అధినేత ఆకుల నరసింహారావు సంతాప సభ కుమారుడు ఆప్తా (ఎన్ఆర్ఐ), శ్రీధర్ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఆకుల నరసింహారావు, ఉమాలక్ష్మి లక్ష్యాలకు అనుగుణంగా విద్యావ్యాప్తికి కృషి చేస్తామన్నారు. గ్రామంలో రూ.10 లక్షలతో రామాలయం నిర్మాణం, 150 మందికి రూ. 20 లక్షల స్కాలర్‌షిప్ అందిచామన్నారు. ట్రస్టు ద్వారా మరింత మంది విద్యావ్యాప్తికి కృషి చేస్తామన్నారు.

బీజేపీ తరపున జబర్దస్త్ కళాకారుల ప్రచారం


బీజేపీ తరపున జబర్దస్త్ కళాకారుల ప్రదర్శన

ఉంగుటూరు, ఫిబ్రవరి 26: బీజేపీ తరపున ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లో జబర్దస్త్ కళాకారులు, సినీ గేయ రచయిత అనంత శ్రీరాం ఆధ్వర్యంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను జబర్దస్త్ కళాకారులు కళారూపంలో వివరించారు. వెల్లమిల్లి, బొమ్మిడి, కైకరం, ఉంగుటూరు గ్రామాలు, నిడమర్రు మండలంలో పలు చోట్ల ప్రదర్శనలు జరిపారు. 16 ఏళ్లుగా తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవలందిస్తున్న గారపాటి సీతారామాంజనేయ చౌదరికి రానున్న ఎన్నికలలో మద్దతు ఇచ్చి గెలిపించాలని కళాకారులు కోరారు.

బీజేపీ సభను విజయవంతం చేయండి

కామవరపుకోట, ఫిబ్రవరి 26: ఏలూరు నగరంలో మంగళవారం జరగనున్న బీజేపీ కార్యకర్తల సభను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు ఒంటెద్దు ఏసువరప్రసాద్ పిలుపునిచ్చారు. కళ్ళచెరువు, గండిగూడెం, పోలాసిగూడెం, జీలకర్రగూడెం, కొత్తూరు, పాతూరు, తాడిచర్ల, రావికంపాడు, రామన్నపాలెం, తూర్పుయడవల్లి, తదితర గ్రామాల్లో సోమవారం ఆయన అనుచర బృందంతో ప్రచారం చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కీలకమైన సమావేశమని, ప్రతీ బూత్ కమిటీ సభ్యుడు సమావేశానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు ఈ సభలో సందేశాలను అందచేస్తారని, అందరూ రావాలని పిలుపునిచ్చారు.

సామాజిక అన్యాయంపై బీజేపీ పరిష్కారం చూపాలి

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26: రాష్ట్రంలో సామాజిక అన్యాయంపై మంగళవారం ఏలూరులో నిర్వహించే సమావేశంలో బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకత్వం పరిష్కార చర్యలను ప్రకటించాలని సోషల్ జస్టిస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్ డిమాండ్ చేసారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు పాలించిన కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు సామాజిక అన్యాయంపై సరైన రీతిలో స్పందించలేదన్నారు. కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీ వైఖరి తెలియజేయాలన్నారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లను రద్దుచేస్తేనే బీసీలు, ఓసీలు, దళిత క్రైస్తవులకు న్యాయం జరుగుతుందని వివరించారు. ముస్లింలకు బీసీ(ఇ) రిజర్వేషన్ల వివాదం సుమారు 17 ఏళ్లుగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లోనే ఉందని, ఈ వివాదానికి కూడా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

పెదపాడు, ఫిబ్రవరి 26: సోషల్ మీడియాలో అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని, వారు పంపించే సందేశాలకు, సమాచారానికి స్పందించవద్దని ఎస్ఐ కె.శుభశేఖర్ సూచించారు. హైస్కూల్ విద్యార్థులకు సోషల్ మీడియా, సైబర్ నేరాలు, దిశ యాప్‌పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అపరిచితుల సందేశాలను తెరిస్తే ఆర్థిక నష్టంతో పాటు అనేక ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. ఆపదలో వున్న సమయంలో 112, 100 కు ఫోను చేసి పోలీసుల సాయం పొందాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం. వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'మాటా' ఉచిత వైద్య శిబిరం

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26: తెలుగు రాష్ట్రాల్లో సామాజిక సేవల కోసం ఏర్పాటుచేసిన 'మాటా' (మన అమెరికా తెలుగు సంఘం) ఆధ్వర్యంలో మంగళవారం ఆర్ఆర్‌పేటలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏపీ ప్రతినిధి జి.వంశీకృష్ణ సోమవారం తెలిపారు. డాక్టర్ బి.విజయ భాస్కర్ ఆర్థో సంబంధిత సమస్యలతోపాటు, వెన్నుముక వైద్యానికికూడా పరీక్షలు చేస్తారని వివరించారు. తెలుగు రాష్ట్రాల్లో పలు విద్య, వైద్య సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఉచిత వైద్యశిబిరానికి హాజరయ్యే వారు 70681 04104, 89029 86568 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.





పెదపాడులో ఆరు గ్యారెంటీ పథకాలను వివరిస్తున్న చింతమనేని, ఏలూరులో పథకాలు వివరిస్తున్న బడేటి చంటి, బుట్టాయగూడెంలో మాట్లాడుతున్న బొరగం శ్రీనివాసులు, జంగారెడ్డిగూడెంలో రోషన్ పరిచయ సమావేశం

వైసీపీ పాలనలో

రాష్ట్రంలో దోపిడీ

తెలుగుదేశం పార్టీ నేతల ధ్వజం


ఉంగుటూరు నాయకులకు క్యాలెండర్ అందజేస్తున్న గన్ని వీరాంజనేయులు

పెదపాడు, ఫిబ్రవరి 26 : వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలతో రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేశారని, జగన్‌రెడ్డి పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజులు త్వరలో రానున్నాయని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదపాడు శివారు గండిచెరువుగట్టులో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి పాదయాత్రగా ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. చింతమనేని మాట్లాడుతూ మరో రెండు నెలల్లో నియంత పాలన పోతుందని, మహిళా శక్తి పథకం ద్వారా చంద్రబాబు మహిళలకు అండగా నిలుస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమికి అండగా నిలవాలని కోరారు. బొప్పుడి కాశీబాబు, మోరు శ్రావణి, గుత్తా అనిల్, బొప్పన బాబ్జి, కొత్తూరు చినబాబు, గారపాటి రామసీత, లావేటి శ్రీనివాసరావు, నర్రా సుబ్రహ్మణ్యం, మోరు దశరథ్, అక్కినేని వంశీకృష్ణ, గుండపనేని కళ్యాణ్, ఖండవల్లి జరహో, గారపాటి మోహనరావు, పెద్దసంఖ్యలో టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: రానున్న ఎన్నికల్లో టీడీపీ జనసేన కూటమిని ప్రజలు ఆదరిస్తారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడేటి చంటి ధీమా వ్యక్తం చేశారు. 21 డివిజన్‌లో చంటి ప్రజాసంకల్ప యాత్రలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సూపర్ 6పథకాలు వివరించారు. వైసీపీ నాయకులు కూటమి మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారన్నారు.

● బుట్టాయగూడెం: మై ఫస్ట్ ఓట్ ఫర్ సిబిఎన్‌కే కార్యక్రమం ద్వారా యువతను చైతన్యవంతులను చేసి మొదటి ఓటు టీడీపీ, జనసేన కూటమికి వేయించాలని దాసరి శ్యామ్ చంద్రశేషు, నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జగన్ పాలనలో యువతకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించాలన్నారు. పారేపల్లి రామారావు, గన్నిన సురేంద్రనాద్ చౌదరి, బొబ్బర రాజు, మొగపర్తి సోంబాబు, శీలం వెంకటేశ్వరావు, నాయుడు రామకృష్ణారావు గౌడ్, ములిశెట్టి నాగేశ్వరావు, సుంకపల్లి సాయికృష్ణ, పారేపల్లి సురేష్, ఉండవల్లి సోమసుందరం, కాల్నిడి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం సభ విజయవంతం చేయాలి

భీమడోలు: తాడేపల్లిగూడెంలో ఈనెల 28న జరిగే టీడీపీ, జనసేన ఎన్నికల శంఖారావం సభను విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పిలుపునిచ్చారు. గన్ని క్యాంపు కార్యాలయంలో ఉంగుటూరు నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. సభకు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

● జంగారెడ్డిగూడెం: తాడేపల్లిగూడెంలో జరిగే టీడీపీ, జనసేన ఉమ్మడి బహిరంగ సభను విజయంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కొళ్ల నాగేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి సొంగా రోషన్‌కుమార్ పిలుపునిచ్చారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ అధ్యక్షతన నియోజకవర్గ ఇన్‌చార్జి సొంగా రోషన్‌కుమార్ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రోషన్‌ను అత్యంత మెజార్టీతో గెలిపించాలన్నారు. రోషన్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన కార్యకర్తలను, నాయకులను కలుపుకుంటూ ముందుకు వెళ్తానన్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అవినీతి పెరిగిందని దుయ్యబట్టారు. ప్రపంచమంతా డిజిటల్ పేమెంట్స్ జరుగుతుంటే రాష్ట్రంలోని మద్యం దుకాణాల్లో నగదు మాత్రమే తీసుకుంటున్నారు. ఈ డబ్బంతా ఎక్కడకు వెళ్తుందని ప్రశ్నించారు. ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనకు విజయం తథ్యమన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, గోరుముచ్చు గోపాల్‌యాదవ్, మండవ లక్ష్మణరావు, పెనుమర్తి రామ్‌కుమార్, షేక్ ముస్తఫా, రాజాన సత్యనారాయణ, కరుటూరి రమాదేవి, పరిమి సత్తిపండు, ముత్యాలరెడ్డి, బొబ్బర రాజ్‌పాల్‌కుమార్, నంబూరి రామచంద్రరాజు, ఇంద్రాని, తూటికుంట రాము, జనసేన నాయకుడు రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **టి.నరసాపురం :** వృద్ధ కళాకారులకు రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు, సీనియర్ బుర్ర కథ కళాకారులు వీరమళ్ళ సత్యనారాయణ డిమాండ్ చేశారు. వృద్ధ కళాకారులు ఆకతో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వృద్ధ కళాకారులకు రూ.5వేలు పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని వారు కోరారు.
- టి.నరసాపురం, తెడ్లం, కేతవరం, బందంచర్ల గ్రామాల్లో సచివాలయ భవనాలను, బందంచర్ల, టి నరసాపురం పంచాయతీల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలను, గుడ్లపల్లి, తిరుమలదేవిపేట గ్రామాల్లో మల్టీ పర్పస్ గోడౌన్‌లను ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రారంభించారు. అనంతరం కె.జగ్గవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు వెలిది కృష్ణమూర్తి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. గంజిమాల దేవి, జడ్పీటీసీ సూరిబాబు, వాసిరెడ్డి మధు, ఎంపీపీ డి.లక్ష్మి వెంకటేశ్వరరావు, దేవరపల్లి ముత్తయ్య సర్పంచ్ తడికలపూడి శివమాధవి ఎంపీటీసీలు బండి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.
- **బుట్టాయగూడెం :** సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ (చంద్రన్న వర్గం) నాయకుడు కూరపాటి రామారావు లింగమూర్తి అలియాస్ లింగన్న సేవలు మరువలేనివని ఏఐకేఎంఎస్ నాయకులు కలింపూడి సుందరావు, సముద్రాల బాలసుందరావు అన్నారు. మర్రిగూడెంలో లింగన్న సంతాప సభలో వారు మాట్లాడారు. పూనెం పార్వతి, పాయం భూలక్ష్మి, నాగరాజు, కె.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.
- **పోలవరం :** కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సంగినీడి సత్యనారాయణ, గొంతి వేణుగోపాలరావు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. జెట్టి గురునాధరావుతో పాటు తాము రాజీనామా చేస్తున్నట్లు లేఖలను జిల్లా అధ్యక్షుడు రామ్మోహనరావుకు అందించారు.
- **కొయ్యలగూడెం :** అంకాలగూడెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి మండల పరిషత్ నిధులు మంజూరు చేశారు. నిర్మాణ పనులకు ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ గంజిమాల రామారావు, మట్టా సత్తిపండు, ఎంపీటీసీ జాన్‌డేవిడ్ కింగ్, సర్పంచ్ గడ్డియ్య, రామకృష్ణ, రవి, తదితర నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



గడ్డే బంగారం

తుఫాన్‌తో పైరుకు దెబ్బ.. పశుగ్రాసం కొరత

భారీగా పెరిగిన ధర.. పశుపోషకుల బెంబేలు

ముదినేపల్లి, ఫిబ్రవరి 26 : వరిగడ్డికి మహా డిమాండ్ ఏర్పడింది. తుఫాన్ ఫలితంగా సార్వా వరి పంట పెద్దఎత్తున పాడైపోవడమే ఇందుకు కారణం. గతంలో ఎన్నడూ లేని విధంగా ముదినేపల్లి ప్రాంతంలో ఎకరం వరి గడ్డి ధర రూ.12 నుంచి రూ.14 వేలు పలుకుతోంది. వేలాది ఎకరాల్లో వరి పైరు నీట మునిగి కుళ్లిపోవడంతో వరి గడ్డి కొరత ఏర్పడింది. ఇప్పటివరకు ఇతర ప్రాంతాలకు వరిగడ్డిని సరఫరా చేసే ముదినేపల్లి ప్రాంత రైతులు ఇప్పుడు తమ పశువులకు గ్రాసం కోసం గడ్డిని పలు ప్రాంతాల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గుడివాడ, జొన్నపాడు, పుట్టగుంట, పామర్రు తదితర ప్రాంతాల నుంచి ముదినేపల్లి మండలంలోని పలు గ్రామాల రైతులు వరి గడ్డిని కొనుగోలు చేస్తున్నారు. గతంలో ఎకరం వరి గడ్డి రూ.6వేలు నుంచి రూ.8 వేల వరకు ఉండేది. పంట నష్టం తదితర కారణాలతో ఆ ధర రూ.14 వేలకు చేరింది. ఇక రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. తిరిగి సార్వా పంటలు వచ్చే వరకు మరో పది నెలల కాలానికి సరిపడ వరిగడ్డిని పశుపోషకులు నిల్వ చేసుకుంటున్నారు. అధిక ధరలకు వరిగడ్డిని కొనుగోలు చేయాల్సి రావడం పశుపోషకులకు తీవ్ర భారంగా తయారైంది.



హుండీల ఆదాయం లెక్కింపు జరుపుతున్న సిబ్బంది

చిన వెంకన్న హుండీ ఆదాయం రూ 2.39 కోట్లు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 26: ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి హుండీల ఆదాయం గడచిన 28 రోజులకు గాను రూ.2.39 కోట్లు సమ కూరింది. ప్రమోద కల్యాణమండప ఆవరణలో సోమవారం భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించారు. 2 కోట్ల 39 లక్షల 33 వేల 108 రూపాయల నగదుతో పాటు భక్తులు సమర్పించిన కానుకల రూపేణా 424 గ్రాముల బంగారం, 5.674 కేజీల వెండి లభించినట్లు ఈవో త్రినాథరావు తెలిపారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (30), 1000(2), 2000 (13)తో పాటు విదేశీ కరెన్సీ లభించింది.

నేటి నుంచి 'టెట్'

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26 : మంగళవారం నుంచి ప్రారంభం కానున్న ఉపాధ్యాయ అర్హతా పరీక్ష (ఏపీ టెట్) నిర్వహణపై సోమవారం ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల డీఈవోలు, పరీక్షల అధికారులతో టెట్ రాష్ట్ర పరిశీలకునిగా నియమితులైన ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ డైరెక్టర్ ఆర్.నరసింహారావు సోమవారం సాయంత్రం డీఈవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పరీక్షల నిర్వహణపై సూచనలు చేశారు. పరీక్షార్థులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా ముందుగానే సంబంధిత సెంటర్లలో ఏర్పాట్లను పరిశీలించి ఏమైనా లోటుపాట్లు ఉంటే సరిచేయాలని ఆదేశించారు. పరీక్ష గదులను తెలుసుకోవడంలో గందర గోళానికి తావులేకుండా ప్రవేశద్వారం వద్ద నోటీసుబోర్డులో వివరాలను ప్రద ర్శిం చాలని సూచించారు. రెండు జిల్లాల్లో తాను ఏ సమయంలోనైనా ఆకస్మిక తనిఖీలకు వస్తానని వెల్లడించారు. నిర్ణీత పరీక్ష ప్రారంభ సమయం దాటిన తర్వాత ఒక్కనిమిషం ఆలస్యమైనా అభ్యర్థిని అనుమతించబోమని గంట ముందు గానే అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని డీఈవో సూచించారు. డిపార్ట్‌మెంటల్ అధికారులు, డీవైఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 16వ తేదీకి లోక్ అదాలత్ మార్పు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 26 : మార్చినెల 9వ తేదీన జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను మార్చి 16వ తేదీకి మార్చినట్టు శాశ్వత లోక్‌అదాలత్ ఛైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారి తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ నుంచి సోమవారం అందిన ఉత్తర్వులు మేరకు మార్చి 9న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను మార్చి 16వ తేదీకి మార్చినట్టు తెలిపారు. జిల్లాలోని న్యాయవాదులు, కక్షిదారులు, అధికారులు ఈ విషయాన్ని గమనిం చాలని తెలిపారు.



మాట్లాడుతున్న పర్మినెంట్‌లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ గ్రేస్ కుమారి

ఏలూరు జిల్లా న్యాయ ధికార సంస్థలో ప్రతిరోజు ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌లు నిర్వహిస్తారని కేసులను పరిష్కరించుకోవడానికి రావాలని సూచించారు. సోమవారం నిర్వ హించిన ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌లో భార్యభర్తల వివాద కేసుల్లో విచారిం చడమైందని ఇరువురు కలిసి కాపురం చేసుకునే విధంగా కౌన్సెలింగ్ నిర్వ హించి రాజీ చేశామన్నారు.ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కక్షిదారు లందరూ ఈ ప్రీసిట్టింగ్ లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలన్నారు.

క్రైం కార్నర్

సారా తయారీ స్థావరంపై పోలీసుల దాడి

ముసునూరు, ఫిబ్రవరి 26: వేల్పుచర్లలో సారా తయారీ స్థావరంపై ముసునూరు ఎస్సై పి.వాసు తన సిబ్బందితో కలిసి సోమవారం మెరుపుదాడి చేశారు. సారా తయారు చేస్తున్న జోగి లక్ష్మణరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని 1800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు సారా తయారీకి ఉపయోగించే సామాగ్రి, 30 లీటర్ల సారాను సీజ్‌చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడు లక్ష్మణరావు పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.



తెలంగాణ మద్యం స్వాధీనం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 26: నూజివీడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పరిధిలో నిర్వ హించిన దాడుల్లో తెలంగాణ మద్యం సీసాలను స్వాధీన పరుచుకున్నట్లు సెబ్ సీఐ వెంకటరమణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూజివీడు సెబ్ స్టేషన్‌పరిధిలోని చాట్రాయి మండలం పోలవరం గ్రామంలో అక్రమంగా తరలించి విక్రయిస్తున్న 28 మద్యం బాటిళ్ళను స్వాధీన పరుచుకుని పోలవరం గ్రామానికి చెందిన లింగాల సుజాత అనే మహిళను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు.





గోపవరంలో ఒరిగిన విద్యుత్ స్తంభాలు

దడ పుట్టిస్తున్నాయ్!

కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభాలు ▸ కన్నెత్తి చూడని అధికారులు

కైకలూరు, ఫిబ్రవరి 26: దశాబ్దాల క్రితం వేసిన ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు ఒరిగి కూలిపోయేలా ఉండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో అనేకచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసేందుకు ఆ శాఖ అధికారులు గతంలో రెండు స్తంభాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్‌ను నిర్మించారు. కాలానుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లను పక్కనే దిమ్మలను ఏర్పాటుచేసి వాటిపైకి మార్పు చేసినప్పటికీ స్తంభాలను అలాగే ఉంచడంతో అవి శిధిలావస్థకు చేరాయి. కైకలూరు మండలం గోపవరం మంచినీటి చెరువుగట్టుపై ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు కూలిపోయేలా ఉన్నాయి. ఆ రహదారి గుండా ప్రయాణించే ప్రజలు స్తంభాలు ఎప్పుడు కూలిపోతాయో అన్నట్లు ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. స్తంభాలకు సిమెంటు పెచ్చులు ఊడి కన్పిస్తున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే స్తంభాల చుట్టూ ముళ్లపొదలు ఉండడం, మరమ్మతులు చేసే సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నా వాటిని పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. స్తంభాలను మార్పు చేస్తే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి ఉండదని ఆ శాఖ అధికారులు వాటిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న కైకలూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ రామ్‌ప్రసాద్

రేపు బహిరంగ సభ విజయవంతం చేయాలి

కైకలూరు, ఫిబ్రవరి 26: తాడేపల్లిగూడెంలో ఈ నెల 28న టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కైకలూరు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వేములపల్లి శ్రీరామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం కైకలూరు పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతలతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ బహిరంగ సభకు కైకలూరు నియోజకవర్గం నుంచి వేలాదిమంది టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. అందుకు పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు మెంటే పార్థసారథి, పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి, రాష్ట్ర వడ్డి సాధికార కమిటీ కన్వీనర్ బలే ఏసురాజు, మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, పార్టీ జిల్లా నాయకులు పోలవరపు లక్ష్మీరాణి, కేకే బాబు, టీడీపీ నాయకులు కొడాలి వినోద్, దావు నాగరాజు, ఎండీ జానీ, సుధా, జనసేన నాయకుడు కొల్లి వర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



చాట్రాయి నుంచి మంగళగిరి వెళుతున్న టీడీపీ శ్రేణులు

మంగళగిరి తరలిన టీడీపీ శ్రేణులు

చాట్రాయి, ఫిబ్రవరి 26: నూజివీడు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి పార్టీలో చేరుతున్న సందర్భంగా మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయానికి సోమవారం చాట్రాయి మండలం నుంచి తెలుగు తమ్ముళ్లు భారీగా తరలివెళ్ళారు. అన్ని గ్రామాల నుంచి మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు 30 కార్లలో తరలివెళ్ళారు. మండల నాయకులు మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, బొట్టు రామచంద్రరావు, అత్తులూరి శ్రీనివాసరావు, నోబుల్ రెడ్డి, మరిడి చిట్టిబాబు, పలగాని దుర్గారావు, వెల్ది నాగేశ్వరరావు, సీహెచ్. పుల్లారావు, చీకటి చెన్నారావు, హనుమంతరావు తదితరులు మంగళగిరి వెళ్ళారు.



ఆలపాడులో కాలినడకన పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

కైకలూరు, ఫిబ్రవరి 26: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్ అన్నారు. సోమవారం ఆలపాడులో పోలీసు సిబ్బంది ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలు వారి ఓటు హక్కును భయభ్రాంతులకు గురికాకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. గ్రామీణా ప్రాంతాల్లో వర్గ విభేదాలకు తావులేకుండా ప్రతి ఓటరు తనకు నచ్చిన పార్టీకి ఓటు వేసుకునేలా ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలు ఒకరినొకరు దూషించుకోకుండా సమన్వయంతో మెలగాలన్నారు. ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా, ప్రలోభాలకు గురిచేసినా చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సమయంలో వివాదాలు జరిగితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, జీవితకాలం వారిపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. రూరల్ ఎస్సై టి రామకృష్ణ, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

చిన్నంపేట హైస్కూల్ అప్‌గ్రేడ్



చాట్రాయి, ఫిబ్రవరి 26: మండలంలోని చిన్నంపేట జడ్పీ హైస్కూల్‌ను జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎంఈవో బ్రహ్మచారి తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ (కో-ఎడ్యుకేషన్) క్లాసులు జూన్ 1 నుంచి ప్రారంభం అవుతాయని, ఎంపీసీలో 40, బైపీసీలో 40, సీఈసీలో 40 సీట్లు మంజూరు అయ్యాయని ఎంఈవో వివరించారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్లు

విద్యాహక్కు చట్టం కింద 2024-25 సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల్లో పేద పిల్లలకు ఒకటో తరగతిలో ఉచిత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో బ్రహ్మచారి కోరారు. ప్రతికూల పరిస్థితుల్లో ఉన్న అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ నెల 23 నుంచి మార్చి 14 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని, పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో గాని, డీఈవోను గాని, టోల్ ఫ్రీ నంబరు 18004258599లో సంప్రదించాలన్నారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉద్యోగావకాశాలు



కలిదిండి, ఫిబ్రవరి 26 : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చందన ఉమా మహేశ్వరరావు అన్నారు. ఇటీవల నూతన భవనాన్ని ప్రారంభించిన నేపథ్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల జడ్పీ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ పదవ తరగతి పాసైన విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదివిన విద్యార్థులు నూరు శాతం క్యాంపస్ సెలక్షన్లలో ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. ఫీజులు తక్కువగా ఉంటాయని పేద విద్యార్థులు కూడా పాలిటెక్నిక్ విద్యను అభ్యసించే వెసులుబాటు ఉందన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డి.ప్రసాద్, ఎంఈవో ప్రభాకర్ బాబు, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ఎన్ఆర్ఐ విద్యార్థుల అవగాహన



ఆగిరిపల్లి, ఫిబ్రవరి 26: ఆగిరిపల్లి ఎన్ఆర్ఐ కళాశాల ఆధ్వర్యంలో కనసానపల్లి గ్రామంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైం, నీటిపారుదల తదితర అంశాలపై విద్యార్థులు గ్రామస్థులకు అవగాహన కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.నాగభాస్కర్‌రావు తెలిపారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, అధ్యాపకులు వేణుగోపాల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మార్చి 11 నుంచి పెద్దింటమ్మ జాతర

కైకలూరు, ఫిబ్రవరి 26: కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి జాతర మహోత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు కైకలూరులో ఆవిష్కరించారు. మార్చి 11 నుంచి 24 వరకు ఉత్సవాలు జరగనున్నాయి. అలాగే మార్చి 8న గోకర్ణపురంలోని గోకర్ణేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఆవిష్కరించారు. శివరాత్రి ఉత్సవాలకు గోకర్ణపురంలో విస్తృతస్థాయి ఏర్పాట్లను నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ అధికారి కేవీ గోపాలరావు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



సూరేపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ బాజీ

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఉండాలి

ముసునూరు, ఫిబ్రవరి 26: మండల వ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సకల సదుపాయాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జీఎస్ఎస్ జవహర్ బాజీ ఆదేశించారు. సోమవారం చెక్కపల్లి, సూరేపల్లి, చిల్లబోయినపల్లి, గుళ్ళపూడి, గుడిపాడు, లోపూడి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రస్తుతం ఉన్న సదుపాయాలు, కల్పించాల్సిన సౌకర్యాలపై బీఎల్‌వోలు, సంబంధిత అధికారులతో ఆయన చర్చించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అన్ని పోలింగ్ కేంద్రాలను నిబంధనల ప్రకారం సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ముఖ్యంగా పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన నేమ్ బోర్డులలో అనేక తప్పులున్నాయని, వాటిని తక్షణమే సరిచేయాలని సూచించారు. ఆర్ఐ దీపిక, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పోలింగ్ స్టేషన్‌లలో సదుపాయాలను నూజివీడు తహసీల్దార్ ఏవీ శాస్త్రి సోమవారం పరిశీలించారు. మండలంలోని సీతారాంపురం, మర్రిబందం, పొలసానపల్లి, రామన్నగూడెం తదితర గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్‌లను ఆయా గ్రామాల వీఆర్వోలతో కలిసి పరిశీలించారు. పోలింగ్ స్టేషన్‌లలో విద్యుత్ సరఫరా, ర్యాంప్ ఏర్పాటు తదితరాలను ఆయన చూసి సూచనలను చేశారు.





నిరసన తెలుపుతున్న సంయుక్త కిసాన్ మోర్చా

డబ్ల్యూటీవో ఒప్పందాలతో.. రైతులు, కార్మికులకు తీవ్ర నష్టం

సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 26: రైతులకు, కార్మికులకు తీవ్ర నష్టం కలిగిస్తున్న డబ్ల్యూటీవో ఒప్పందాల నుంచి భారత్ తప్పుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్లో నిరసనను తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి, నూజివీడు ఆర్డీవో భవానీ శంకరికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘం ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని, పరిశ్రమలను దెబ్బతీసే ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాల నుంచి భారత్ వెంటనే తప్పుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బత్తుల వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ఉపప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.ఆర్ హనుమాన్లు, జి.రాజు, రైతు సంఘం నాయకులు మడుపల్లి నాగేంద్రరావు, కూచిపూడి నాగేశ్వరరావు, చలసాని జగన్‌మోహన్‌రావు, పీఏసీఎస్ మాజీ కార్యదర్శి ఒగ్గు బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ భారీ బహిరంగ సభ

నూజివీడు, ఫిబ్రవరి 26: నూజివీడు నియోజకవర్గంలో టీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు పార్టీ నూజివీడు పట్టణ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్ తెలిపారు. నూజివీడు నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా కొలుసు పార్థసారథి ఎంపిక, అధికారికంగా ఆయన పార్టీలో చేరిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు నూజివీడు మండలం సీతారాంపురం గ్రామం నుంచి బైక్ ర్యాలీ, అదేవిధంగా నూజివీడు పట్టణంలో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. టీడీపీ-జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని కోరారు.

నేడు చెక్కపల్లిలో సురక్ష వైద్య శిబిరం

ముసునూరు, ఫిబ్రవరి 26: మండలంలోని చెక్కపల్లి గ్రామ సచివాలయం వద్ద మంగళవారం ఉదయం 9 గంటలకు ఆరోగ్య సురక్ష ఫేజ్-2 వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్. పద్మావతిదేవి తెలిపారు. ఈ శిబిరాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుంత రోడ్డుపై ఇళ్ల నిర్మాణం వద్దు

కలిదిండి, ఫిబ్రవరి 26 : వెంకటాపురంలో పుంత రహదారిపై ఇళ్ల నిర్మాణం నిలుపుదల చేయాలని సోమవారం సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు స్పందనలో తహసీల్దార్ వంశీకి ఫిర్యాదు చేశారు. దళితవాడ నుంచి గొల్లగూడెం వరకు ఉన్న పుంత రోడ్లను ఇళ్ల స్థలాలకు కేటాయించి లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేశారని వీఆర్వో ద్వారా తెలిసిందన్నారు. 1920వ సంవత్సరం నుంచి పుంత రోడ్డుగా ఉండి గ్రామస్థులకు రహదారిగా ఉపయోగపడుతోందని ఇళ్లు నిర్మిస్తే గ్రామస్థులకు, రైతులకు రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశానని ఆయన తెలిపారు.

డ్రెయిన్ పూడికను నిలిపివేయాలి

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 26: జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చౌటపల్లి మైనర్ డ్రెయిన్ స్ట్రెయిన్ ఫ్యాక్టరీ నుంచి పెదపాలపర్రు శ్మశాన వాటిక వరకు పూడిక చేస్తున్నారని దీంతో గ్రామంలో 450 ఎకరాలు ఆయకట్టు పరిధిలో మురుగునీరు ఎగదన్ని జనావాసానికి ఇబ్బంది కలుగుతుందని సోమవారం స్పందనలో సర్పంచ్ గంటా రాకేష్ కుమార్ ఆధ్వర్యంలో రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తక్షణం నిలుపుదల చేయకుంటే గ్రామస్థులు 5 వేల మంది ఖాళీ చేసి వెళ్ళిపోవాల్సిన పరిస్థితి ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఏపీటీఎఫ్ నూజివీడు మండల కమిటీ

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 26: ఏపీటీఎఫ్ నూజివీడు మండల కమిటీ ఎన్నికను పల్లెర్లమూడి జడ్పీ హైస్కూలులో నిర్వహించారు. మండల కన్వీనర్‌గా ఎస్ఆర్ఆర్ జడ్పీహైస్కూల్‌కు చెందిన ఎల్.ఎన్.రాజు, కో-కన్వీనర్‌గా పల్లెర్లమూడి పాఠశాలకు చెందిన జె.విజయ్‌రత్న, సభ్యులుగా జి.రాజభూషణ్‌రావు, ఎం.రత్నాకర్ ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సాల్మన్‌రాజు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏపీ జేఏసీ ఏకపక్ష నిర్ణయాలతో ఉద్యమాలను తాకట్టుపెట్టి 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు అన్యాయం చేసిందన్నారు. జిల్లా అధ్యక్షుడు తాడూరి రామారావు మాట్లాడుతూ కమిటీ సభ్యులు ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండి, సంఘాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పరిశీలకుడిగా బి.రెడ్డిదొర వ్యవహరించారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత



చాట్రాయి, ఫిబ్రవరి 26: ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో చాట్రాయి సెంటర్ రామాలయం వద్ద సోమవారం ఎయిడ్స్ నిర్మూలనపై కళాభారతి బృందం కళాకారులు ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్ఐవీ సోకకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు, హెచ్ఐవీ లక్షణాలు కన్పిస్తే పరీక్షలు ఎక్కడ చేయించుకోవాలి, వ్యాధి నిర్ధారణ అయితే ఏఆర్టీ మందులు ఎలా వాడాలి, టీబీ, క్షయ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాకారులు వీధి నాటికలు, పాటలు, హాస్య సన్నివేశాల ద్వారా ప్రజలకు వివరించారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం



చాట్రాయి, ఫిబ్రవరి 26: సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంకు మేనేజర్ హనుమంతరావు కోరారు. చాట్రాయిలో సోమవారం ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రిజర్వు బ్యాంకు డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ ఫండ్, యూనియన్ బ్యాంకు సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ద్వారా వివిధ మండలాల్లో ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. బ్యాంకు అందించే పొదుపు, బీమా, రుణ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాలు ఉపయోగించుకోవాలని కోరారు. కౌన్సిలర్లు చందు, చెన్నారావు, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం రికవరీ సాధించాలి



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 26: మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడవాలంటే నూరు శాతం రికవరీని సాధించాలని ఎస్.ఆర్.ఎల్.ఎం. ప్రోగ్రాం ఆఫీసర్ కె.జయరామ్ అన్నారు. నూజివీడు మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులతో సోమవారం సమావేశమై మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు డ్వాక్రా రుణాలతో ఉపాధి అవకాశాలను మెరుగుపరుచు కోవాలన్నారు. ఈ సందర్భంగా నూజివీడులో ప్రారంభించిన మహిళా మార్ట్‌ను ఆయన సందర్శించి కొనుగోళ్ళు, అమ్మకాల పరిస్థితిని సమీక్షించారు. వెలుగు ఏపీఎం దయాల రాజశేఖర్, లీగల్ కోఆర్డినేటర్ ప్రసాద్, మండల సమాఖ్య అధ్యక్షురాలు నవత తదితరులు పాల్గొన్నారు.

చిన్నం మోటారు వితరణ



చాట్రాయి, ఫిబ్రవరి 26: మండలంలోని మర్లపాలెంలో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య సొంత నిధులతో బోరు చేతి పంపుకు సోమవారం మోటారు అమర్చారు. తమ విజ్ఞప్తి మేరకు రామకోటయ్య మోటారు పంపటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మిట్టగూడెంలో ఎన్ఎస్ఎస్ శిబిరం



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 26: నూజివీడు మండలం మిట్టగూడెం గ్రామంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం బాల్యవివాహాల నివారణ-యువత పాత్ర, వ్యసనాల నివారణ మార్గాలపై ర్యాలీ అనంతరం అంగన్‌వాడీ సెం టర్లో అవగాహన కార్యక్రమాలను నిర్వ హించారు. మిట్టగూడెం పాఠశాలలో విద్యార్థులకు వలంటీర్లు భోజన ఏర్పాట్లను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌లక్ష్మి, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 26: మండలంలోని దేవపూడి గ్రామంలో రూ. 46 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. రూ. 15 లక్షలతో నిర్మించిన డ్రెయిన్లు ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.